Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
5-1-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక:54

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# రైతు భరోసాకు ఏటా రూ. 12 వేలు


## భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు ఏటా సాయం రూ.12,000

- గుట్టలు, రాళ్లు, రోడ్లు, పరిశ్రమలు, నాలా కన్వర్షన్, ప్రభుత్వం సేకరించిన భూములకు వర్తించదు
- ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'గా నామకరణం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వెసులుబాటు మేరకు ఇస్తున్నాం
- రేషన్‌కార్డులు లేని పేద కుటుంబాలన్నింటికీ కొత్త కార్డుల జారీ
- జనవరి 26 నుంచి ఈ మూడు పథకాల అమలు ప్రారంభిస్తామని వెల్లడి
- రాష్ట్ర మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు



హైదరాబాద్: రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా పథకం కింద ఎకరాకు ఏటా రూ.12 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు కూడా ఏటా రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. ఈ కొత్త పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'అని పేరుపెట్టినట్టు తెలిపారు. ఇక రాష్ట్రంలో రేషన్‌కార్డు లేని పేద కుటుంబాలన్నింటికీ కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

మిగతా 2లో



## 6 నుంచి 8వ తేదీ వరకు చిత్తూరులో సీఎం చంద్రబాబునాయుడు పర్యటన

మిగతా 2లో


## ఢిల్లీ ఎన్నికల కోసం 29మందితో బిజెపి జాబితా

### సిఎం అతిషిపై బరిలో రమేశ్ బిధూరి

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ 29 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషిపై కల్కాజీ స్థానం నుంచి ఆప్ అభ్యర్థి రమేష్ బిధూరిని బీజేపీ నిలబెట్టింది.ఈ జాబితాలో బీజేపీ న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి పర్వేష్ వర్మను బరిలోకి దింపింది. ఆప్ అభ్యర్థి అరవింద్ కేజీవ్రాల్‌పై పర్వేష్ వర్మ పోటీ చేయనున్నారు. ఈ స్థానంలో సందీప్ దీక్షిత్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది.

## తెలియకుండానే తెలుగు అంతరించే ప్రమాదం

- ప్రాథమిక స్థాయి వరకు తెలుగులోనే బోధన
- తెలుగులో కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు
- సినిమా పేర్లు తెలుగులో ఉండాల్సిందే
- ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల్లో కిషన్ రెడ్డి



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషలోనే విద్య ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లో రెండో రోజు ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు జరిగాయి.

మిగతా 2లో



## పోలవరంతో భద్రాచాలనికి ముప్పు



- ఐఐటి హైదరాబాద్ బృందంతో అధ్యయనం
- బనకచర్లకు అనుమతులు లేవన్న అధికారులు
- అవసరమైతే గోదావరి బోర్డుకు ఫిర్యాదు
- ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపైనా ఈ బృందం అధ్యయనం చేయనుంది. 2022లో వచ్చిన వరదల వల్ల భద్రాచలం ముంపునకు గురైందని, 27 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని అధికారులు సీఎం దృష్టికి తసుకెళ్లారు. ఏపీ ప్రభుత్వం కొత్తగా బనకచర్ల ప్రాజెక్టు చేపడుతోందని.. ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు సీఎంకు వివరించారు.

మిగతా 2లో

## ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను పట్టించుకోని కాంగ్రెస్



- గ్రామాల నుంచి పట్టణాలకు పెరిగిన వలసలు
- గ్రామాలకు, పట్టణాలకు మధ్య గ్యాప్ పెరుగుతూనే ఉంది
- గ్రామీణ భారత మహోత్సవం 2025 కార్యక్రమంలో ప్రధాని మోడీ

## మేటి నగరంగా విశాఖపట్నం

### నేవీ విన్యాసాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

- మనవడితో కలిసి హాజరు
- హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్ కూడా..
- ఆకట్టుకున్న తూర్పు నౌకాదళ విన్యాసాలు


మిగతా 2లో




**దేశానికి ముంబై ఎలా ఆర్థిక రాజధానిగా ఉందో.. ఏపీకి విశాఖపట్నం అలా ఆర్థిక రాజధానిగా, మేటి నగరంగా మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను మారిటైమ్ గేట్‌వేగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. నాలెడ్జ్ హబ్‌గా పేరు తీసుకువస్తామన్నారు.**

విశాఖపట్నం: దేశానికి ముంబై ఎలా ఆర్థిక రాజధానిగా ఉందో.. ఏపీకి విశాఖపట్నం అలా ఆర్థిక రాజధానిగా, మేటి నగరంగా మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖను మారిటైమ్ గేట్‌వేగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. నాలెడ్జ్ హబ్‌గా పేరు తీసుకువస్తామన్నారు. శనివారం విశాఖ సాగరతీరంలో నిర్వహించిన నేవీ విన్యాసాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు, భార్య భువనేశ్వరి, మనవడు దేవాన్ష్ ఆఖరి వరకూ ఉండి తిలకించారు.

# మేటి నగరంగా విశాఖపట్నం



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ విశాఖపట్నం ఎప్పుడూ వస్తుంటానని, కానీ నేవీ ప్రదర్శన వీక్షించడం ఇదే మొదటిసారన్నారు. పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఆ దేశానికి చెందిన సబ్‌మెరైన్ ఘాజీ విశాఖపట్నం నగరాన్ని నాశనం చేయడానికి వస్తున్నప్పుడు.. దాన్ని ఇక్కడికి సమీపంలో తూర్పు నౌకాదళమే మట్టుబెట్టిందని గుర్తు చేశారు. హుద్‌హుద్ తుఫాన్ వచ్చినప్పుడు తాను పది రోజులు ఇక్కడే ఉండి అన్నీ సరిచేశానని, ఆ సమయంలో నేవీ అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ నెల 8న ప్రధాని విశాఖలో రైల్వే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. త్వరలో విశాఖకు మెట్రో రైలు కూడా వస్తుందన్నారు. గోదావరి జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాదే అనకాపల్లి జిల్లాకు తీసుకువస్తామని, వచ్చే ఏడాది విశాఖపట్నం తెస్తామని ప్రకటించారు. తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ మాట్లాడుతూ, విశాఖ ప్రజలు నేవీ అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నారని, వారి కోసమే ఈ విన్యాసాలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నేవీకి ఎంతో సహకరిస్తోందని చెప్పారు. విశాఖ సాగర తీరాన తూర్పు నౌకాదళం ప్రదర్శించిన సాహస విన్యాసాలు అబ్బురపరిచాయి. ఆద్యంతం అద్భుతంగా సాగిన ప్రదర్శనలు చూపరుల కళ్లు తిప్పుకోనివ్వకుండా చేశాయి. మెరైన్ కమెండోలు ఆకాశం నుంచి ఎనిమిది వేల అడుగుల ఎత్తు నుంచి పారాచ్యూట్ సాయంతో దిగడం, తీరంలో యుద్ధట్యాంకులు మోహరించడం తదితర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వాస్తవానికి నేవీ డే సందర్భంగా డిసెంబరు 4న ఈ విన్యాసాల ప్రదర్శన పూరీ తీరంలో రాష్ట్రపతి ఎదుట నిర్వహించారు. విశాఖ ప్రజల కోసం ప్రత్యేకంగా మరోసారి శనివారం సాయంత్రం ఇక్కడి ఆర్‌కే బీచ్‌లో ప్రదర్శించారు. విన్యాసాల్లో భాగంగా మెరైన్ కమెండోలు ఆకాశం నుంచి ఎనిమిది వేల అడుగుల ఎత్తు నుంచి పారాచ్యూట్ సాయంతో వేదిక దగ్గర దిగి సీఎం చంద్రబాబునాయుడుకు జ్ఞాపికను బహూకరించడం విశేషంగా ఆకట్టుకుంది. అలాగే, యుద్ధనౌక ఐఎన్‌ఎస్‌పై నుంచి ప్రదర్శించిన లేజర్ షో, డ్రోన్లతో ప్రదర్శించిన వివిధ చారిత్రక చిహ్నాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ ?దీరజ్‌సింగ్ ఠాకూర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను పట్టించుకోని కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** వెనకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను గత ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదని ప్రధాని మోడీ విమర్శించారు. దాంతో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరిగాయన్నారు. ఫలితంగా పట్టణాల్లోనూ పేదరికం పెరిగిపోయిందన్నారు. సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నా గ్రామాలకు, పట్టణాలకు మధ్య గ్యాప్ పెరుగుతూనే ఉందని ప్రధాని నరేంద్ర మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన గ్రామీణ భారత మహోత్సవం 2025 కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు తమ పాలనలో సమాన హక్కులు పొందుతున్నాయని నరేంద్ర మోడీ వెల్లడించారు. సమాజ సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, పాటిస్తున్న విధానాలే గ్రామీణ భారతంలో కొత్త శక్తిని నింపుతున్నాయని చెప్పుకొచ్చారు. ఇక, మారుమూల గ్రామాల ప్రజలను దేశ అభివృద్ధిలో భాగం చేయడమే లక్ష్యంగా తమ సర్కార్ కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసేందుకు సమ్మిళిత ఆర్థిక విధానాలు అవసరం. ఇక, కరోనా సమయంలో భారత్‌లోని మారుమూల గ్రామల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఇక, డిజిటల్ టెక్నాలజీ సహాయంతో దేశంలోని అత్యుత్తమ వైద్యులు, ఆసుపత్రులను మారుమూల గ్రామాలకు అనుసంధానం చేశామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. గ్రామాలలోని ప్రజలు ప్రస్తుతం టెలీమెడిసిన్ సౌకర్యాలను పొందుతున్నారని చెప్పుకొచ్చారు. అలాగే, పల్లెల్లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగు నీరు, మౌలిక వసతులు అందిస్తున్నాం.. పీఎం-కిసాన్ పథకం ద్వారా, రైతులకు కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల ఆర్థిక సహాయం అందిస్తుంది.. అలాగే, తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల వల్ల గ్రామీణ భారతంలో పేదరికం దాదాపు 26 శాతం నుంచి 5 శాతానికి తగ్గిపోయిందని నరేంద్ర మోడీ వెల్లడించారు. సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నా గ్రామాలకు, పట్టణాలకు మధ్య అంతరం పెరుగుతూనే ఉందని ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు ప్రస్తుతం తమ పాలనలో సమాన హక్కులు పొందుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. సమాజ సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, పాటిస్తున్న విధానాలు గ్రామీణ భారతంలో కొత్త శక్తిని నింపుతున్నాయన్నారు. మారుమూల గ్రామాల ప్రజలను దేశ అభివృద్ధిలో భాగం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి సమ్మిళిత ఆర్థిక విధానాలు అవసరమని పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో భారత్‌లోని మారుమూల ప్రాంతాల ప్రజలు ఆ మహమ్మారిని ఎలా ఎదుర్కొంటారని ప్రపంచ దేశాలు అనుమానం వ్యక్తంచేసినట్లు మోదీ పేర్కొన్నారు. కానీ తమ ప్రభుత్వం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుందన్నారు. డిజిటల్ టెక్నాలజీ సహాయంతో దేశంలోని అత్యుత్తమ వైద్యులు, ఆసుపత్రులను గ్రామాలకు అనుసంధానించామని వెల్లడించారు. గ్రామాలలోని ప్రజలు ప్రస్తుతం టెలీమెడిసిన్ సౌకర్యాలను సైతం పొందుతున్నారన్నారు. పల్లెల్లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు, మౌలిక వసతులు అందిస్తున్నామని మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల మూలంగా గ్రామీణ భారతంలో పేదరికం దాదాపు 26 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందని వెల్లడించారు.

## పోలవరంతో భద్రాచాలనికి ముప్పు

తెలంగాణ అభ్యంతరాలను ఏపీ సీఎస్‌కు తెలపాలని, అవసరమైతే గోదావరి బోర్డు, కేంద్ర జలశక్తిశాఖకు లేఖలు రాయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటి పారుదల శాఖ) ఆదిత్యనాథ్ దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ పైన పడే ప్రభావంపై ఐఐటీ హైదరాబాద్ టీంతో నివేదిక తయారు చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక తయారు చేయాలని తెలిపారు. ఐఐటీ హైదరాబాద్ టీంతో కో ఆర్డినేషన్ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పోలవరం నిర్మాణంతో భద్రాచలం దేవాలయానికి ఏర్పడే ముప్పుపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన గోదావరి బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ పైన ఇటీవల ఏపీ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని తెలిపారు. వరద జలాల ఆధారంగా నిర్మిస్తున్న ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు సీఎంకు తెలియజేశారు.

## తెలియకుండానే తెలుగు అంతరించే ప్రమాదం

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. కేంద్ర తెచ్చిన కొత్త విద్యా విధానాన్ని రాష్ట్రాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టుల్లో వాదనలు, ప్రతివాదనలు తెలుగులో జరగాలని డిమాండ్ చేశారు. సినిమాల పేర్లు కూడా తెలుగులోనే ఉండాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగు సమాఖ్య మహాసభలకు హాజరైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని నిర్వహకులు సన్మానించారు. మాట్లాడటం, రాయడం ద్వారానే భాషను పరిరక్షించగలమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. పిల్లలతో రోజూ బాల సాహిత్యం చదివించాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిజిటల్ విభాగంలో తెలుగు భాష క్రోఢీకరించి భావితరాలకు అందించాలన్నారు. డిజిటల్ రంగంలో మాతృ భాష అభివృద్ధి, సంరక్షణకు దోహదం చేయాలని పేర్కొన్నారు. 'వికీపీడియాలో తెలుగు వ్యాసాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కథలు, వ్యాసాలు ఆడియో రూపంలో అందుబాటులో ఉన్నాయి. తెలుగు కనుమరుగు కాకముందే పరిరక్షించు కోవాలన్నారు. బోధనా భాషగా ప్రాచుర్యంలోకి తేవాలి. పాలన, అధికార వ్యవహారాలు తెలుగులో జరగాలి. కొత్త సాంకేతికత, కార్యక్రమాలను మాతృభాషలోనే చేపట్టాలి. వాడుక భాషలో 30 శాతమే తెలుగు ఉంది. 70 శాతం ఆంగ్ల పదాలే ఉన్నాయి. మనకు తెలియకుండానే తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి కనినిస్తోందని అన్నారు. ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషలో విద్య ఉండాలి.

## రైతు భరోసాకు ఏటా రూ. 12 వేలు

అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి జనవరి 26తో 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ మూడు పథకాల అమలును ప్రారంభించాలని నిర్ణయించామని తెలిపారు. శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలసి రేవంత్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. రైతుభరోసా విషయంలో ఎలాంటి గందరగోళం అవసరం లేదని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములంటే.. రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో పోయిన భూములు, మైనింగ్ భూములు, నాలా కన్వర్షన్ పొందిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, పరిశ్రమల కోసం సేకరించిన భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయబోమని సీఎం స్పష్టం చేశారు.

రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా (లబ్ధిదారుల) సమాచారం సేకరించి గ్రామసభల ద్వారా ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ప్రభుత్వం, అధికారుల వద్ద ఉన్న సమాచారం ఆధారంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను వర్తింపజేస్తామని వెల్లడించారు. రెవెన్యూ రికార్డుల్లో, ధరణిలో లోపాలతో గతంలో వ్యవసాయానికి యోగ్యంకాని భూములకూ రైతుబంధు వచ్చిందని.. వారే స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రభుత్వానికి వివరాలు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఆర్థిక పరిస్థితి, వెసులుబాటు మేరకు..**

రైతు భరోసా కింద ఎకరాకు ఏటా రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని మీడియా గుర్తు చేయగా.. గత ప్రభుత్వం రైతు బంధు కింద ఎకరాకు రూ.10 వేలు ఇస్తే తాము రూ.12 వేలకు పెంచామని సీఎం రేవంత్ బదులిచ్చారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వెసులుబాటును బట్టి భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు సైతం రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఆదాయం పెంచి పేదలకు పంచడమే తమ ప్రభుత్వ విధానమని చెప్పారు. ఎంత వెసులుబాటు ఉంటే అంతగా రైతులకు మేలు చేయాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు.



**భూమి లేని వారి ఆవేదన తీర్చడానికి..**

"తమకు భూములు లేకపోవడం ఒక శాపమైతే, ప్రభుత్వం పట్టించుకోకపోవడం మరో శాపమని గతంలో నేను, భట్టి విక్రమార్క, ఇతర సహచరులు నిర్వహించిన పాదయాత్రల సందర్భంగా తండాల్లో, మారుమూల ప్రాంతాల్లోని భూమి లేని వ్యవసాయ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. వాళ్లు కూడా సమాజంలో, మనలో భాగమని గుర్తించి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని తీసుకొచ్చాం.

## 6 నుంచి 8వ తేదీ వరకు చిత్తూరులో సీఎం చంద్రబాబునాయుడు పర్యటన

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు చంద్రబాబు జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 6 నుంచి 8 వరకు చిత్తూరు జిల్లాలో సీఎం పర్యటన సాగనుంది. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అలాగే డ్వాక్రా సంఘాలతో సమావేశంకానున్నారు. పలు ప్రారంభోత్సవాలు, యువతతో సమావేశాలు నిర్వహించనున్నారు సీఎం. ఈనెల 6న మధ్యాహ్నం 12 గంటలకు ద్రవీడియన్ యూనివర్సిటీలో స్వర్ణ కుప్పం విజన్ 2029 కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రకృతి వ్యవసాయం విజన్‌లను ప్రారంభిస్తారు. అనంతరం స్వర్ణకుప్పం విజన్ 2029 పై చర్చించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అగారాం కొత్తపల్లి గ్రామానికి వెళ్లి డ్వాక్రా సంఘాలతో సీఎం మాటామంతి నిర్వహించనున్నారు. 2:30 గంటలకు నడిమూరు గ్రామంలో సౌర విద్యుతీకరణ కార్యక్రమం ప్రారంభం అనంతరం స్థానిక యువతతో ఇష్టాగోష్టిలో పాల్గొటారు. అనంతరం సిగాల పల్లెకు చంద్రబాబు చేరుకుంటారు. సాయంత్రం 5:30 గంటలకు ద్రవీడియన్ యూనివర్సటీ ఆడిటోరియంలో పార్టీ క్యాడర్‌తో సమావేశం అవుతారు. రాత్రి 7:30 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు బస చేయనున్నారు. 7న ఉదయం 10 గంటలకు కుప్పం టీడీపీ ఆఫీసుకు సీఎం చేరుకుంటారు. అక్కడ జన నాయకుడు సెంటర్‌ను సీఎం ప్రారంభిస్తారు. అనంతరం ప్రజల నుంచి అర్జీల స్వీకరించనున్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు కంగుండి గ్రామానికి వెళ్లనున్న సీఎం.. శ్యామన్న విగ్రహన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు కుప్పం ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు చంద్రబాబు వెళ్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకూ మథర్ డెయిరీ, శ్రీజా మహిళా పాల సేకరణదారుల సంస్థను సీఎం చేతుల మీదుగా ప్రారంభంకానుంది. ఎన్టీఆర్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, కాడా కమండ్ కంట్రోల్ రూం, మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం హాజరుకానున్నారు. ఐఐటీ కాన్పూర్‌తో అవగాహన కుదుర్చుకుని కుప్పాన్ని నెట్ జీరో నియోజకవర్గంగా మార్చే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు. మహిళా శక్తి భవన్‌లో ఏలీప్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నారు. సీఈవో బిగ్ బాస్కట్, ఎన్డీడీపీ చైర్మన్‌లతో సమావేశం అవుతారు. సాయంత్రం 4:45 గంటలకు కుప్పంలోని తమ నివాసానికి ముఖ్యమంత్రి చేరుకుంటారు. సాయంత్రం 6 గంటలకు ద్రవీడియన్ యూనివర్సిటీలో అకడమిక్ సెంటర్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు..అధికారులతో అక్కడే సమావేశం అవనున్నారు. రాత్రికి కుప్పం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌తో రెండవ రోజు చంద్రబాబు బస చేయనున్నారు. తిరిగి ఎనిమిదివ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరిగి అమరావతికి చేరుకోనున్నారు.

## ఢిల్లీ ఎన్నికల కోసం 29మందితో బిజెపి జాబితా

మరోవైపు దుష్యంత్ గౌతమ్ కరోల్ బాగ్ నుంచి, మంజిందర్ సింగ్ సిర్సా రాజౌరీ గా÷-డ్గ÷న్ నుంచి, కైలాష్ గెహ్లాట్ బిజ్వాసన్ నుంచి పోటీ చేయనున్నారు. కరోల్ బాగ్ నుంచి దుష్యంత్ గౌతమ్, రాజౌరీ గా÷-డ్గ÷న్ నుంచి మంజిందర్ సింగ్ సిర్సా, బిజ్వాసన్ నుంచి కైలాష్ గెహ్లాట్, గాంధీ నగర్ నుంచి అరవిందర్ సింగ్ లవ్లీ సహా పలువురికి టిక్కెట్లు ఇవ్వబడ్డాయి. ముఖ్యమంత్రి అతిషిపై కల్కాజీ స్థానం నుంచి కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు అల్కా లాంబా పోటీ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ హైకమాండ్ శుక్రవారం ప్రకటించింది. అల్కా కాంగ్రెస్‌ను వీడి 2013లో ఆప్‌లో చేరి 2015లో చాందినీ చౌక్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 2019లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. గత ఎన్నికల్లో చాందినీ చౌక్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ 48 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ముందుగా రెండు జాబితాలను విడుదల చేసి 47 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాపై జంగ్‌పురా నుంచి ఫర్హాద్ సూరీని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించింది. కాగా, బీజేపీ సర్దార్ తర్విందర్ సింగ్ మార్వాను రంగంలోకి దించింది.

## నాంపల్లి కోర్టుకు హాజరైన అల్లు అర్జున్

### ష్యూరిటీలపై సంతకం చేసిన బన్నీ

హైదరాబాద్: బెయిల్ మంజూరు కావడంతో హీరో అల్లు అర్జున్ నాంపల్లి కోర్టుకు హాజరయి పూచీకత్తు సమర్పించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో ఏ11గా ఉన్న అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీంతో పూచీకత్తు సమర్పించేందుకు, మేజిస్ట్రేట్ ముందు కొన్ని పత్రాలపై సంతకాలు చేసేందుకు అల్లు అర్జున్ నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. రెండు షూరిటీలను, వ్యక్తిగతంగా బాండ్ ను బన్నీ సమర్పించారు.




## సీఎం రేవంత్‌రెడ్డి చెంపలేసుకొని క్షమాపణ చెప్పాలి : కేటీఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి లాంటి వారికి కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఏం తెలుసునని, కాళేశ్వరం గురించి అవాక్కులు, చవాక్కులు మాట్లాడినందుకు తెలంగాణ ప్రజలకు చెంపలేసుకొని క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీటి తరలింపునకు జలమండలి ఆమోదం తెలిపింది. ఈ ఆమోదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత విషం చిమ్మినా.. తెలంగాణ దాహం తీరుస్తోంది మన కాళేశ్వరం అని కేటీఆర్ పేర్కొన్నారు. మల్లన్నసాగర్ వద్దని నిరాహార దీక్షలు మీరు చేసినా నేడు మహనగర దాహార్తి తీరుస్తున్న వరప్రదాయిని మల్లన్నసాగర్ అని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసినా.. తెలంగాణను సస్యశ్యామలం చేసింది కాళేశ్వరం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పుడైనా చెంపలేసుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పు అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. కాళేశ్వరం కూలిపోయిందని కాకమ్మ కథలు చెప్పావు. లక్ష కోట్ల నష్టం వాటిల్లిందని అబద్ధపు ప్రచారాలు చేశావు.. అధికారం కోసం కాళేశ్వరాన్ని నిందించినా.. నేడు ప్రజల దాహార్తి తీర్చే ఏకైక అస్త్రం కాళేశ్వరం అయిందని కేటీఆర్ స్పష్టం చేశారు.



## తిప్పర్తిలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**నల్లగొండ, జనవరి 4 (ఆర్ఎన్ఎ):** నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. మిర్యాలగూడెం మండలం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన గందం శ్రీనివాస్ (33) నల్గొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తుండగా, అదే వైపు నుంచి వస్తున్న కారు మిర్యాలగూడ వైపు అతివేగంగా వెళతూ వెనుక నుంచి బైక్‌ను ఢీ కొట్టింది. అనంతరం కారు రోడ్డు పక్కన ఉన్న ఒక చెట్టును ఢీ కొట్టి ఆగిపోయింది. కారు నుజ్జునుజ్జు కాగా ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శ్రీనివాస్ కొద్ది దూరంలో ఎగిరిపడి చనిపోయారు. కారులో ఉన్న మరో మహిళ సైతం కారులో నుంచి ఎగిరి పక్కనే ఉన్న పొలాల్లో పడి స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. కారులోని మరో ఇద్దరికి సీరియస్‌గా ఉండటంతో, చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

## చీటింగ్ అంటేనే కాంగ్రెస్ : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ అంటేనే చీటింగ్ అని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పునాదులే మోసం మీద నిర్మించబడ్డాయని విమర్శించారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అర్ధ శతాబ్దం పాటు కాంగ్రెస్ పార్టీనే పాలించిందని గుర్తు చేశారు. కానీ పేదలకు చేసిందేమీ లేదని అన్నారు. ప్రతి దినం గడిచేందుకు పేదలు ప్రభుత్వాలపై ఆధారపడుతూనే ఉన్నారన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లను కూడా కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలో పాటు మైనార్టీలకు అనేక మోసపూరిత హామీలిచ్చిందని, ఈ వర్గాలను ప్రయోజకులుగా తీర్చిదిద్దలేదన్నారు. ప్రతి స్కామ్‌లో కాంగ్రెస్ హస్తం ఉంటుందని ఎద్దేవా చేశారు. అమృత్ గేట్ నుంచి కోల్ గేట్ వరకు అన్ని కుంభకోణాలే. ఈ స్కామ్‌లకు పాల్పడింది అగ్రవర్ణ ధనికులే కాదా అని ప్రశ్నించారు. కుంభకోణాలు చేసేందుకు నిరుపేదలను ఉపయోగించుకున్నారన్నారు. అంబేద్కర్, జగ్జీవన్ రామ్, బీపీ మండల్, పీవీ నరసింహారావు, వీపీ సింగ్, షెల్జా, కాకా కాల్కేకర్‌తో పాటు జస్టిస్ మురళీధర్ రావు లాంటి వారిని మోసం చేసింది కాంగ్రెస్ పార్టీనే.. ఈ జాబితాలో ఇంకా ఎంతో మంది ఉన్నారన్నారు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. నేటి బీజేపీని సృష్టించడం వెనుకాల కాంగ్రెస్ పార్టీ నేతలే ఉన్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

## ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో భారీ పేలుడు

### పేలుడు ధాటికి ఒకరు మృతి... ఏడుగురికి తీవ్ర గాయాలు

**యాదాద్రి భువనగిరి,(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలంలో శనివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. పెద్దకందుకూరులో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో సంభవించిన పేలుడు ధాటికి ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుడిని బచ్చన్నపేట్ గ్రామానికి చెందిన ఎం కనకయ్యగా గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉన్న ప్రకాశ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా కార్మికులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ సైరన్‌తో పరిశ్రమ యాజమాన్యం కార్మికులను అప్రమత్తం చేసింది. దీంతో భయంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు. బాధితుల కుటుంబాలు పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## వామన అవతారంలో భద్రాద్రి రాముడు

**భద్రాచలం,(క్రైమ్ మిర్రర్):** భద్రాచలంలోని రాములవారి ఆయంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సీతారామచంద్ర స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఐదో రోజైన శనివారం వామన అవతారంలో సీతారాములు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం మహానివేదన అనంతరం తిరువీధి సేవ నిర్వహించారు. కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ నేపథ్యంలో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న గోదావరిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. జనవరి 10న వైకుంఠ ద్వారం ద్వారా సీతారామచంద్ర స్వామి దర్శనమిస్తారు. దీంతో ఈ నెల 10వ తేదీ వరకు ఆలయంలో నిత్య కల్యాణాలను అధికారులు నిలిపివేశారు. కాగా, నాలుగో రోజైన శుక్రవారం నరసింహావతారంలో రామయ్య దర్శనమిచ్చారు. తొలుత స్వామివారిని ఆలయంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత నిత్యకల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ పూజాధికాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు స్వామివారికి వేద విన్నపాలు సమర్పించారు. తర్వాత మిథిలా స్టేడియానికి మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు.

## ప్రజాప్రతినిధుల క్వార్టర్లకు నోటీసులు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ప్రజాప్రతినిధులకు తెలంగాణ అసెంబ్లీ అధికారులు నోటీసులు ఇచ్చారు. క్వార్టర్స్ ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు హైదర్‌గూడలోని కొత్త క్వార్టర్స్ కేటాయిస్తామని అధికారులు వెల్లడించారు. ఇప్పుడున్న క్వార్టర్స్ ప్రాంతంలో కాన్స్టిట్యూషనల్ క్లబ్ నిర్మించబోతున్నట్లు, అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ , మాజీ ఎంపీ అంజనీ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ సహా అన్ని క్వార్టర్స్‌కు నోటీసులు ఇచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు క్వార్టర్స్‌లో ఉన్న పలు షాపులకు సైతం అధికారులు నోటీసులు జారీ చేశారు.

# హైడ్రా మరో కీలక నిర్ణయం

## సమస్యలు పరిష్కరించేందుకు హైడ్రా గ్రీవెన్స్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను పరిష్కరించేందుకు హైడ్రా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఎల్లుండి (జనవరి 6) నుంచి హైడ్రా ప్రధాన కార్యాలయం బుద్ధ భవన్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలిసారిగా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదు స్వీకరించనున్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్న 2:00 గంటల వరకు ఫిర్యాదులను హైడ్రా చీఫ్ స్వీకరించనున్నారు. అలాగే వారం రోజుల్లో హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. సంక్రాంతి నుంచి హైడ్రా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. హైడ్రా పీఎస్ ఏర్పాటుపై రేపు (ఆదివారం) అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను 10 రోజుల్లోపు పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్నారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల ఫిర్యాదులపై హైడ్రా స్పెషల్ ఫోకస్ పెట్టింది. న్యాయ వివాదాలు లేకుండా పకడ్బందీగా ఫిర్యాదులను పరిష్కరించాలని హైడ్రా నిర్ణయించింది. హైడ్రా మరో ముందడుగు వేసింది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించేందుకు హైడ్ర గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేసింది. ఇకపై హైడ్రా గ్రీవెన్స్ ప్రతీ సోమవారం ఉండనున్నట్లు సమాచారం. దీంతో పాటు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హైడ్రా పోలీస్‌స్టేషన్ కూడా సంక్రాంతికి ప్రారంభంకానుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఇకపై హైడ్రాకు సంబంధించిన కార్యకలాపాలు పూర్తిగా కూడా హైడ్రా పోలీస్‌స్టేషన్ ద్వారా నిర్వహించేందుకు వీలుగా హైడ్రా కమిషన్ రంగనాథ్ నిర్ణయం తీసుకున్నారు. సంక్రాంతి నుంచి హైడ్రా పోలీస్‌స్టేషన్ ద్వారా సేవలను అందుబాటులో ఉంచనున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా గ్రీవెన్స్‌కు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించేందుకు అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొననున్నారు. బుద్ధభవన్‌లో జరుగనున్న ఈ గ్రీవెన్స్‌లో ముఖ్యంగా నాలాలు, చెరువులు, ఇతర ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులు ఏవి వచ్చినా సరే న్యాయపరంగా ఇబ్బందులు కాకుంగా వారం నుంచి పది రోజుల్లోపు ఫిర్యాదుదారులు ఇచ్చిన కంప్లైంట్‌లను క్లియర్ చేసే విధంగా హైడ్రా ఓ ప్రణాళికను రూపొందించినట్లు తెలుస్తోంది. గత నెలలోనే హైడ్రా గ్రీవెన్స్ ప్రారంభంకావాల్సి ఉంది. కొంత ఆలస్యమైనప్పటికీ కూడా హైడ్రా గ్రీవెన్స్‌తో పాటు హైడ్రా పోలీస్‌స్టేషన్ అందుబాటులోకి రానుంది. డీఎస్పీ స్థాయి అధికారి, ఎస్పీ స్థాయి అధికారితో పాటు సీఐలు, ఎస్ఐలు కూడా హైడ్రా పోలీస్‌స్టేషన్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండనున్నారు. చెరువుల ఆక్రమణలు, నాలాల కబ్జాలు, కుంటల కబ్జాలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణమే పరిష్కరించాలని హైడ్రా నిర్ణయించింది. హైడ్రా ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు ఐదువేలకు పైగా ఫిర్యాదు వచ్చాయి. ఇందులో అత్యధికంగా నగర శివారుల ప్రాంతాలైన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల నుంచి ఎక్కువగా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి స్థానిక ఎమ్మార్వోలు, రెవెన్యూ సిబ్బంది గ్రీవెన్స్‌లో పాల్గొనే అవకాశం ఉంది. వారు హాజరుకానిపక్షంలో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమాచారం ఇవ్వనున్నారు. మరోవైపు ఆక్రమణలపై హైడ్రా మరింత దూకుడుగా ముందుకు పోతోంది. ఇటీవల కాలంలో ఖాజాగూడ, మల్కాజ్‌గిరిలో ఆక్రమణలను హైడ్రా కూల్చివేసింది. హైడ్రా వద్దకు వస్తే తప్పకుండా సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఫిర్యాదుదారుడు అనుకోవాలనే ఉద్దేశంతో హైడ్రా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

# కేటీఆర్‌పై కావాలనే తప్పుడు కేసులు

### రైతు భరోసా డైవర్టు కోసమే ఏసీబీ కేసు : జగదీశ్‌రెడ్డి



**సూర్యాపేట, (క్రైమ్ మిర్రర్):** రైతు భరోసాను ఎగ్గొట్టేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. దేశంలో అతి చెత్త కేసుల్లో మాజీ మంత్రి కేటీఆర్‌పై నమోదైన కేసు తప్ప మరొకటి లేదన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బడే బాయ్, చోటే బాయ్ కలసి ఏం పనులు చేస్తున్నారో ప్రజలు గమమనిస్తున్నారు. అయినా వీళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇచ్చినోడు తెలుసంట.. తీసుకున్నోడు తెలవదంట.. ఇది ఏం కేసో రేవంత్ రెడ్డికే తెలియాలి. తీసుకున్నోడు వచ్చి రేవంత్ రెడ్డిని కలిసిండు కాబట్టి ఆయనపై కేసు లేదు.. ఇందులో మొదటి నేరస్థుడు రేవంత్ రెడ్డి అందులో ఎలాంటి సందేహం లేదని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు భరోసా ఎగ్గొట్టడానికి, రైతులను పక్కదారి పట్టించేందుకే కేటీఆర్‌పై పెట్టిన కేసును ముందుకు తీసుకువస్తున్నాడని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. రుణమాఫీ జాబితాను ఫైనాన్స్ సెక్రటరీ సంతకం పెట్టి విడుదల చేయాలి. రుణమాఫీ కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి మాత్రం అందరికీ రుణమాఫీ చేశామని చెబుతుండు. వరంగల్ డిక్లరేషన్‌లో రైతు రుణమాఫీకి ఎలాంటి నిబంధనలు పెట్టలేదు.. ఇప్పుడు నిబంధనలు పెడుతున్నారు. రుణమాఫీ విషయంలో రూ. 46 వేల కోట్లు అని చెప్పి రూ. 36 వేల కోట్లు కేటాయించి, రూ. 26 వేల కోట్లు క్యాబినెట్లో ఆమోదించి రూ. 18 వేల కోట్లను విడుదల చేసి 12 వేల కోట్లను మాత్రమే మాఫీ చేశారని జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ తెచ్చిన ప్రతి అప్పుకు ఆస్తి ఉందని, సంవత్సర కాలంలో మీరు తెచ్చిన రూ. 1,28,000 కోట్లతో ఎక్కడైనా ఒకచోట ఒక్క ఆస్తి నిర్మాణమైన చేశారా చెప్పాలి.. కొత్త పథకం ఏమైనా ఇచ్చారా చెప్పాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏ పథకానికి ఒక రూపాయి ఇవ్వకుండా ఢిల్లీకి కొన్ని, మీరు కొన్ని పంచుకొని రాష్ట్ర ప్రజల నెత్తిన అప్పు వేస్తున్నారు. రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పి ఒక ఉద్యోగం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న ప్రజాప్రతినిధులను ప్రతి వర్గం నిలదీయాల్సిన అవసరం ఉంది అని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రీమియర్ ఎక్స్‌క్లూజివ్ పరిశ్రమలో పేలుడు

### ఒకరి మృతి..మరొకరి పరిస్థితి విషమం

### మృతుడు బచ్చన్నపేటకు చెందిన కనకయ్యగా గుర్తింపు

### ఘటనాస్థలిని సందర్శించిన విప్ బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట, (క్రైమ్ మిర్రర్):** యాదగిరిగుట్ట మండలంలోని ఓ పరిశ్రమలో పేలుడు సంభవించి ఒకరు మృతి చెందారు. పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌క్లూజివ్ పరిశ్రమలో ఈ పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన కనకయ్య అనే కార్మికుడు మృతి చెందాడు. మరో ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామానికి చెందిన మొగిలిపాక ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉంది. దీంతో ఆయన్ను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. యాజమాన్యం ఎమర్జెన్సీ సైరన్‌తో కార్మికులను అప్రమత్తం చేసింది. పలువురు క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుప్రతులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరిశీలించారు. ప్రమాదం గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యం చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. గత మూడేళ్ల వ్యవధిలో ఐదుగురు కార్మికులు చనిపోయారని.. కార్మికుల ప్రాణాలు పణంగా పెట్టి కంపెనీలు ధనార్జన చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెయ్యి మంది ఉద్యోగులు ఉన్న కంపెనీలో అంబులెన్స్ కూడా లేదన్నారు. ప్రమాదాల నివారణపై యాజమాన్యంతో చర్చిస్తామని చెప్పారు. ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



## శంషాబాద్ విమానాశ్రయంలో ఇండిగో విమానం అత్యవసరంగా ల్యాండింగ్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ విమానాశ్రయంలో ఇండిగో విమానం అత్యవసరంగా దిగింది. ముంబై నుంచి విశాఖపట్నం వెళుతున్న ఇండిగో విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. గుర్తించిన పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ఏటీసీ అనుమతి కోరారు. ఎమర్జెన్సీ తీవ్రతను గుర్తించిన ఏటీసీ అధికారులు అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతిచ్చారు. దీంతో విమానం సేఫ్‌గా ల్యాండవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానంలో సిబ్బందితోపాటు 144 మంది ప్రయాణిస్తున్నారు. గత నెల 21న శంషాబాద్ విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా విమానం అత్యవసరంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. చెన్నై నుంచి పుణె వెళ్తున్న ఎయిర్ ఇండియాకు చెందిన విమానం శంషాబాద్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. దట్టమైన పొగమంచు కారణంగా వాతావరణం అనుకూలించకపోవడంతో విమానం సుమారు మూడు గంటల పాటు ఆకాశంలోనే చక్కర్లు కొట్టింది. అనంతరం విమానాన్ని పైలట్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలో 180 మంది ప్రయాణిస్తున్నారు.

## గంగూలీ కుమార్తె సనాకు త్రుటిలో ప్రమాదం

కోల్‌కతా: మాజీ క్రికెటర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ కుమార్తె సనాకు త్రుటిలో ప్రమాదం తప్పింది. సనా ప్రయాణిస్తున్న కారును వేగంగా వచ్చిన ఓ బస్సు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాద ఘటన బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని డౌమండ్ హార్బర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. సనా తన కారులో బెహలా చౌరస్తాలో వెళ్తుండగా.. కోల్‌కతా నుంచి రాయ్‌చక్ వెళ్తున్న బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సమయంలో సనా డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్నారు. అయితే ఈ ప్రమాదం నుంచి సనా, ఆమె డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారును ఢీకొట్టిన వెంటనే బస్సు వేగంగా ముందుకు వెళ్లగా.. కారు డ్రైవర్ దాన్ని వెంబడించారు. కొంత దూరం వెళ్లిన తర్వాత బస్సును అడ్డగించి.. సనా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్

4
ఆదివారం
5-1-2025

## అన్నదాతలను వంచిస్తున్న ప్రభుత్వాలు!

వ్యవసాయ సంక్షోభాన్ని అధ్యయనం చేసి, అన్నదాతలను గట్టెక్కించే ప్రయత్నాలు ఏవీ ముందుకు రావడం లేదు. హామీలన్నీ అటకెక్కుతున్నాయి. ఎన్నికల ముందు అన్ని పార్టీలు అన్నదాతల గురించి, వారి సమస్యల గురించి చర్చిస్తారు. అందమైన అబద్దాలను ఇంపుగా చెబుతారు. గద్దెనెక్కాక యధావిధిగా మర్చిపోతున్నారు. అందుకే దేశంలో వ్యవసాయరంగం లాభసాటిగా లేకుండా పోతోంది. రైతులకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. మద్దతు ధరల విధానం సక్రమంగా అమలు కావడం లేదు.



దగాపడుతున్న అన్నదాతను ఆదుకునే ప్రయత్నాలు కేవలం కంటితుడుపు చర్యగానే ఉన్నాయి. సకాలంలో ఎరువుల అందవు. విత్తనాల కొరత యధావిధిగా ఉండనే ఉంటుంది. ఎరువులు, నకిలీ విత్తనాలు, మార్కెట్లో మోసాలను తట్టుకుని మనకు అన్నం పెడుతున్న రైతన్న విషయంలో ఏ ప్రభుత్వం అయినా న్యాయం చేయడం లేదు. నిలదీస్తే వారిని నిలువరిస్తున్నారు. దేశంలో గత మూడు దశాబ్దాల్లో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఇటీవల సుప్రీంకోర్టు తనకందిన అధికారిక నివేదిక నుంచి పేర్కొంది. నివేదికలకెక్కని చావులను కూడా పరిగణన లోకి తీసుకుంటే ఈ ఆత్మహత్యల లెక్క ఏడు లక్షలకు పైబడే ఉంటుందని పరిశీలకుల అంచనా. వ్యవసాం ఒక ప్రధాన జీవన రంగంగా సాగుతున్న దేశంలో రైతుల పరిస్థితి ఇంత దుర్భరంగా ఉండడం చాలా బాధాకరం. కేంద్ర ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చకపోగా ఎరువుల ధరలను పెంచి, సహకార వ్యవస్థలను, మార్కెట్టు యార్డులను నిర్వీర్యపర్చి మరిన్ని ఇక్కట్లకు గురి చేస్తోంది. కేంద్రంలోని బిజెపి తాను అమలు చేస్తామని అనేకసార్లు వల్లించిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి తదితర 11 డిమాండ్లతో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ నవంబరు 26వ తేదీన నిరాహార దీక్ష చేపట్టి నెలరోజులు గడిచిపోయినా కేంద్రప్రభుత్వ పెద్దల్లో కనీస చలనం లేకపోవటం శోచనీయం. ఎండనక వాననక ఆరుగాలం చెమటోడ్చి కష్టించే అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాలతో ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. వాటికి అదనంగా దళారుల మోసాలు, మార్కెట్ ధర పతనాలు, రవాణా భారాలూ చేరి, కష్టాలూ కన్నీళ్లే దిగుబడులుగా వ్యవసాయాన్ని వ్యయభరితంగా మార్చేశాయి. ఈ దుర్భర స్థితి నుంచి రైతును రక్షించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కష్టాలను మరింత పెంచుతు న్నాయి తప్ప, భరోసాగా నిలవటం లేదు. మోసకారి విధానాలతో అన్నదాతల ఉసురు పోసుకోవటం పాలకులకు పరిపాటిగా మారింది. రైతు దేశానికి వెన్నెముక అంటూ ఉపన్యాసాలు ఊదరగొట్టే ప్రభుత్వాలు ఆ వెన్నెముకను కర్కశంగా విరిచేసే చేతలకు తెగిస్తున్నాయి. చేసిన శ్రమకు, ఉత్పత్తికి కనీసంలో కనీసంగా ఖరీదు కట్టటం అనేది ఒక సాధారణ న్యాయం. కానీ, ఈ సాధారణ న్యాయం దశాబ్దాల తరబడి రైతులకు అందటం లేదు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న అంశానికి చట్టబద్ధత కల్పించటం ఇంకా ఎండమావిగానే ఉంది. వ్యవసాయరంగం సంక్షోభం నుంచి బయటపడటానికి గతంలో స్వామినాథన్ కమిషన్ కొన్ని సిఫార్సులు చేసింది. పంటలకు మద్దతు ధరను ఇవ్వాలని, సింగిల్ యూనిట్ ప్రాతిపదికన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని, మార్కెట్ సదుపాయాలు పెంచాలని సూచనలు చేసింది. దశాబ్దం క్రితం వరకూ అధికారంలోకి రాక ముందు బిజెపి బలంగా వినిపించిన ఎన్నికల వాగ్దానాల్లో ఇవన్నీ ఉన్నాయి. గద్దెనెక్కాక ఆ హామీలను ఆవలకు విసిరేసి, రైతులకు పంగనామాలు పెట్టే పనికి సమాయత్తమైంది! ఉన్న రాయితీలను తీసేసి, మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే దుస్సాహసానికి ఒడిగట్టింది. వాటిని వెనక్కి తీసుకోవాలని లక్షలాదిమంది రైతులు నెలల తరబడి, ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక పోరాటం చేశారు. తప్పని పరిస్థితుల్లో మోడీ క్షమాపణలు చెప్పి, ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ, ఆ తరువాత ఈ మూడేళ్లలో రైతులను ఉద్ధరించే చర్య ఒక్కటంటే ఒక్కటీ చేపట్టలేదు. ఏడాదికి మూడు విడతలుగా విదిల్చే రూ.6 వేల సహాయాన్నే గొప్ప ఉపకారంగా మోడీ పరివారం చెప్పుకుంటోంది. అలాంటి అరకొర విదిలింపులతో దేశ వ్యవసాయ రంగానికి ఒరిగేది ఏమీ ఉండదు. రైతు సమస్యలపై అధ్యయనం చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల విడుదల నివేదిక కూడా దీనినే స్పష్టం చేస్తోంది. కనీస మద్దతు ధరకు గ్యారంటీ, రుణమాఫీ, పిఎం కిసాన్ నిధుల రెట్టింపు, బ్జడెట్లో వ్యవసాయరంగ వాటా పెంపు వంటి ప్రతిపాదనలు చేసింది. మోడీ ప్రభుత్వం తాను చెప్పుకుంటున్నట్టు రైతులకు ఇప్పటికే చాలా మేళ్లు చేసివుంటే– కొత్తగా ఈ ప్రతిపాదనలు ఎందుకు? రైతాంగం పట్ల కత్తి కట్టినట్టు వ్యవహరించే ధోరణికి బిజెపి ప్రభుత్వం ఇకనైనా స్వస్తి పలకాలి. రైతుల న్యాయమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలి. భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ఉదారవాద ఆర్థిక విధానాలను విడనాడాలి. రైతు నిశ్చింతగా ఉండటానికి, వ్యవసాయ రంగం నిలబడటానికి ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి. వీటి విషయంలో ఖచ్చితమైన నిబంధనలు రావాలి. అప్పనంగా రైతుల న ఉంచి భూములను లాక్కోవడం, వారికి అరకొరగా విదిల్చడం చేస్తున్నారు. మద్దతు ధరలు, ఎరువుల విధానం, మార్కెట్ల బలోపేతం వంటివన్నీ సక్రమంగా జరగాలి. భూములను అప్పనంగా గుంజుకునే విధానం పోవాలి. లాఠీఛార్జీలు చేయడం, వారిని రోడ్డెక్కించే బరితెగింపు పనులు ఇకముందు సాగకుండా చూడాలి. పారిశ్రామిక వేత్తలకు భూములు కావాలంటే బహిరంగ వేలంలో కొనుగోలు చేసుకునేలా కఠిన చట్టాలు తీసుకుని రావాలి. ఇలా చేస్తే తప్ప అన్నదాత మనుగడ సాగదు.

ఎడిటోరియల్



## చిన్మోయ్ కృష్ణ దాస్‌కు దక్కని బెయిల్

### 11మంది లాయర్ల బృందం ప్రయత్నాలు విఫలం

దేశ ద్రోహం నేరారోపణతో బంగ్లాదేశ్‌లో అరెస్టయి జైల్లో ఉన్న హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్‌కు ఊరట లభించలేదు. ఆయన బెయిల్ పిటిషన్‌ను చటోగ్రామ్‌లోని కోర్టు తిరస్కరించింది. బెయిల్ కోసం 11 మంది లాయర్ల బృందం ప్రయత్నించినప్పటికీ అది ఫలించలేదు. బంగ్లాదేశ్ లోని చటోగ్రామ్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో 30 నిమిషాల పాటు ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. చిన్మయ్ అరెస్టు అనంతర పరిణామాలను దృష్టిలోపెట్టుకొని గురువారం న్యాయస్థానం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ప్రస్తుతానికి ఆయనకు బెయిల్ ఇవ్వలేమని కోర్టు తేల్చిచెప్పింది. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గతేడాది నవంబరులో చిట్టగాంగ్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ బంగ్లా జాతీయజెండాను అగౌరవ పరిచారనే అభియోగాలపై 2024 నవంబరు 25న పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అనంతరం జైలుకు తరలించారు. ఆయన తరఫున వాదనలు వినిపించేందుకు ఓ న్యాయవాది ప్రయత్నించగా.. అతడిపై ఆందోళనకారులు దాడి చేశారు. మరో సీనియర్ న్యాయవాది కేసును టేకప్ చేయగా.. ఆయనపైనా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో చిన్మయ్ కేసును వాదించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు చిన్మయ్ భాగస్వామిగా ఉన్న సమ్మిళిత సనాతన జాగరణ్ జోతే అనే సంస్థ.. 11 మందితో లాయర్ల బృందాన్ని ఏర్పాటుచేసింది. హిందూ సాధువు చిన్మోయ్ కృష్ణ దాస్ బంగ్లాదేశ్‌లో నెల రోజులకు పైగా జైలులో ఉన్నారు. ఈ క్రమంలో కూడా ఆయనకు మళ్లీ షాకింగ్ న్యూస్ వచ్చింది. గురువారం చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరిపి ఆయన బెయిల్‌ను తిరస్కరించారు. దీంతో చిన్మయ్ దాస్ మరికొంత కాలం జైల్లోనే ఉండాల్సి ఉంటుంది. బెయిల్ విచారణ సమయంలో 11 మంది న్యాయవాదులతో కూడిన బెంచ్ విచారణలో పాల్గొన్నా కూడా, చిన్మోయ్ కృష్ణ దాస్‌కు బెయిల్ లభించలేదు. అంతకుముందు డిసెంబర్ 11న బంగ్లాదేశ్ కోర్టు దాస్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విధానపరమైన లోపాల కారణంగా తిరస్కరించింది. ఇది చాలా బాధాకరమైన వార్త అని కోల్‌కతా ఇస్కాన్ వీపీ రాధా రామన్ అన్నారు. ప్రపంచం మొత్తం దీన్ని గమనిస్తోందన్నారు. కొత్త సంవత్సరంలో చిన్మయ్ ప్రభుకి స్వేచ్ఛ లభిస్తుందని అందరూ ఆశించారని పేర్కొన్నారు. అయితే 42 రోజుల తర్వాత కూడా ఈరోజు విచారణలో ఆయన బెయిల్ తిరస్కరించబడింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆయనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. చిన్మోయ్ కృష్ణ దాస్‌పై బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచినట్లు ఆరోపణలు పెడుతూ దేశద్రోహం కేసు నమోదు చేయబడింది. ఈ కేసులో ఆయన తరపున న్యాయవాది అపూర్బా కుమార్ భట్టాచార్జీ నేతృత్వంలో బంగ్లాదేశ్ న్యాయవాదులు వాదిస్తున్నారు. 2024 నవంబర్ 25న ఛటోగ్రామ్‌లోని హజ్రత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి చిన్మోయ్ కృష్ణ దాస్‌ను అరెస్టు చేసిన తరువాత, బంగ్లాదేశ్ న్యాయవాదుల బృందం ఈ కేసును విచారిస్తోంది. చిన్మోయ్ కృష్ణ దాస్ అరెస్టు తరువాత 2024 నవంబర్ 25న చటోగ్రామ్‌లోని న్యాయస్థానం ఆయనపై దేశద్రోహం కేసులో విచారణ ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన జైలులో ఉన్నప్పటికీ, ఆయన తరపున న్యాయవాదులు బెయిల్ కోసం

అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఛాతీ నొప్పి కారణంగా న్యాయవాది చిన్మోయ్ కృష్ణ దాస్ కార్డియాలజీ విభాగంలో చేరారు. భౌతిక అస్వస్థత కారణంగా జనవరి 2న చిట్టగాంగ్ కోర్టులో దేశద్రోహం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న చిన్మోయ్ కృష్ణ విచారణకు ఆయన హాజరుకాలేదు. చిన్మయ్ దాస్ అరెస్టుపై, దాస్ బంగ్లాదేశ్ జాతీయ జెండాను అవమానించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటు న్నారని ఆయనపై వచ్చిన ఆరోపణల గురించి ఢాకా పోలీసులు తెలిపారు. చిన్మయ్ దాస్‌పై బీఎన్పీ మాజీ నేత ఫిరోజ్ ఖాన్ కూడా ఈ ఆరోపణలు చేశారు. అక్టోబర్ 25న చిట్టగాంగ్‌లో హిందూ సంఘాల ర్యాలీ జరిగిందని ఖాన్ ఆరోపించారు. అక్కడే చిన్మోయ్ దాస్, మరో 18 మంది వ్యక్తులు బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచారని అన్నారు. అయితే ఆ సమయంలో బీఎన్పీ నేతగా ఉన్న ఫిరోజ్ ఖాన్ పార్టీ ఆరోపణలు చేసిన కొద్ది రోజులకే బీఎన్‌పీ నుంచి బహిష్కరించబడ్డారు.



## ముక్కోటికి ఉత్తర ద్వార దర్శనం పవిత్రం

ఈ ఏడాది ముక్కోటి ఏకాదశి జనవరి 10న వచ్చింది. ఆరోజున దాదాపు ప్రతి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తారు. అంతే కాదు దగ్గరలో పుణ్య నదులు ఉంటే వాటిలో స్నానమాచరిస్తారు. అలా చేస్తే కోటి పుణ్యాల ఫలం దక్కుతుందని పురాణాలు చెబుతున్నాయి. సూర్య భగవానుడు ఉత్తరాయణ పుణ్య కాలానికి ముందు వచ్చే ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అంటారని పండితులు చెబుతున్నారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన తరువాత మకర సంక్రమణం మధ్యలో ముక్కోటి ఏకాదశి వస్తుంది. దీనినే వైకుంఠ ఏకాదశి అని కూడా అంటారు. ఆ రోజున అంటే జనవరి 10 వ తేదీన వైష్ణవ సంబంధ ఆలయాల్లో తెల్లవారుజామునే ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకుంటారు.

ముక్కోటి ఏకాదశి రోజున న వేకువజామునే లేచి, తలారా స్నానం చేసి.. ఉత్తర ద్వారం గుండా వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. హిందువులు ఆధ్యాత్మికమైన విషయాల్లో చాలా శ్రద్ధ చూపుతారు. పండుగలకు.. విశేషమైన రోజులలో ప్రత్యేకమైన పూజలు నిర్వహిస్తారు. ఇక ఏకాదశి రోజుల్లో విష్ణు సంబంధమైన ఆలయాలను సందర్శిస్తారు. ఇక ముక్కోటి ఏకాదశి అంటే వేరే చెప్పనక్కరలేదు. పురాణాల ప్రకారం మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తుల కోర్కెలను తీరుస్తారు. అందుకే ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏరాదశులతో సమానమని పండితులు చెబుతారు. క్షీర సముద్రాన్ని మథించేటప్పుడు .. ఈ రోజునే హాలాహలం.. అమృతం పుట్టాయ ఆధ్యాత్మిక గ్రంథాల ద్వారా తెలుస్తుంది. పరమేశ్వరుడు.. హాలాహలం మింగి కంఠం దగ్గర ఉంచుకోగా... అమృతాన్ని దేవతలు అందరూ పంచుకున్నారు. అప్పటి నుంచి పరమేశ్వరుడి నీలకంఠేశ్వరుడు అని కూడా పిలవడం మొదలు పెట్టారు. విష్ణు పురాణం .. ప్రకారం.. మహా విష్ణువు ఆ రోజున వైకుంఠ ద్వారాలను తెరిచాడని పండితులు చెబుతున్నారు. ఇద్దరు రాక్షసులు.. మహా విష్ణువును దర్శించుకొనేందుకు ఎంతో కాలంగా ఆ ద్వారాల దగ్గర వేచి యున్నారట. ఆ రాక్షసులు పూర్వ జన్మలో చేసిన పాపాల వలన రాక్షసులుగా జన్మించారు. ఆ రాక్షసులు తమ పాపాలను నివృత్తి చేసి.. వైకుంఠ ప్రవేశం కల్పించాలని విష్ణుమూర్తిని కోరారు. అప్పుడు పుష్యమాసం ఏకాదశి రోజున వైకుంఠ ద్వారం తెరిచి.. వారికి ముక్తిని ప్రసాదించాడట. అందుకే ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు.



## కార్టర్ మరణంతో 30 రోజులు జెండా అవనతం

### బైడెన్ నిర్ణయాన్ని తప్పు పట్టిన ట్రంప్


న్యూయార్క్,జనవరి4(ఆర్ఎన్ఎ): అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ ఇటీవల కన్నుమూసిన నేపథ్యంలో 30 రోజుల పాటు జాతీయ జెండాను అవనతం చేయాలని ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబట్టారు. అంతేకాక దీనిపై అమెరికన్లు సంతోషంగా లేరని వ్యాఖ్యానించారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ చేశారు.'నేను అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే సమయంలో జాతీయజెండా అవనతం చేసి ఉంటుంది. ఇది చాలా గొప్ప విషయంగా వారు భావిస్తున్నారు. ఎందుకంటే వాస్తవంగా వారికి దేశం అంటే ప్రేమ లేదు. అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ మరణం కారణంగా.. కాబోయే అధ్యక్షుడి ప్రారంభానికి జెండా అవనతమై ఉండటం బహుశా ఇది మొదటిసారి కావచ్చు. ఎవరూ దీన్ని చూడాలని అనుకోరు. ఈ నిర్ణయంపై ఏ అమెరికన్ సంతోషంగా లేరు' అని ట్రంప్ రాసుకొచ్చారు. మరోవైపు.. తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించే ఆలోచన లేదని వైట్‌హౌస్ ప్రతినిధి కరీన్ జిన్ పియర్ పేర్కొన్నారు. ఇక, ట్రంప్ జనవరి 20న అధికార బాధ్యతలు చేపట్టనున్నారు. జిమ్మీ కార్టర్ అనారోగ్య కారణాలతో జార్జియాలోని ప్లెయిన్స్‌లో తుదిశ్వాస విడిచినట్లు ఆయన తనయుడు జేమ్స్ ఇ.కార్టర్ 3 తెలిపారు. 1977–1981 మధ్య కాలంలో అగ్రరాజ్యానికి 39వ అధ్యక్షుడిగా కార్టర్ పని చేశారు.

# పరిగి టూ గోరిట్లకు పావురాల రేస్...!

## బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు...!

## గేమింగ్ యాక్ట్ బర్డ్స్ క్రుయాల్టీ యాక్ట్ లా కింద కేసు నమోదు...!

## వివరాలు వెల్లడించిన సీఐ శ్రీనివాస్ రెడ్డి...!





**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** కోడి పొట్టేలు,ఎడ్ల పందాలు ,కార్ రేసింగ్,బైక్ రేసింగ్ అందరికీ తెలిసినవే కానీ ట్యాగులతో ఉన్న పావురాలను ఆకాశంలోకి వదిలి రేసింగ్ నిర్వహిస్తున్న ఘటన వికారాబాద్ జిల్లా పరిధి శివారులో కలకలం రేపింది. శనివారం ఉదయం పరిగి లక్ష్మీ నగర్ కాలనీలో ఓ ట్రాలీ ఆటోలో తెచ్చిన పావురాలను ఆకాశంలోకి వదులుతుండగా స్థానికులు గుర్తించారు. ట్రాలీ ఆటోను తనిఖీ చేయగా 20 బాక్సులలో సుమారు 300 పావురాలు ఉన్నట్లు గుర్తించారు. రెండు బాక్సులలోనీ 30 పావురాలను ఆకాశంలోకి వదిలారు. వాకింగ్ చేస్తున్న పరిగి స్థానిక వ్యక్తులు మా ప్రాంతానికి తెచ్చి ఇక్కడ పావురాలను ఎందుకు వదులుతున్నారు అంటూ నిలదీశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా పావురాలను, ఇద్దరు వ్యక్తులను పోలీస్ స్టేషన్కు తరలించారు. పావురాల బాక్సుల పై కోడ్ నంబర్లు,పావురాల కాళ్లకు కోడ్ నెంబర్లు ఉండటంతో పోలీసులు జానీబాబు,మూనావర్ వారిని విచారించారు. ఈ పావురాలను సత్యసాయి జిల్లా గోరిట్ల గ్రామానికి చెందినవిగా మునావర్,బాబు జానీలు తెలిపారు. ఈ పావురాలను గాలిలోకి వదిలితే గోరుట్లకు ఏ పావురం ముందు వస్తాయో ఆ పావురాల యజమానులు పోటీలో గెలిచినట్లు అని పావురాల ట్రైని మునావర్ తెలిపాడు. ఈ పావురాలు సుమారు 300 కి.మీ ప్రయాణం చేసేలా ట్రైనింగ్ ఇచ్చామని అందుకే వారి పందెంలో భాగంగా ఇక్కడ వదిలేందుకు వచ్చామని తెలిపాడు.

**కేసు నమోదు చేసిన పోలీసులు..!**

పరిగి లక్ష్మీ నగర్ కాలనీలో ఓ ట్రాలీ ఆటోలో తెచ్చిన పావురాలను ఆకాశంలోకి వదులుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి సీఐ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలలతో దోమ ఎస్సై, సిబ్బంది చేరుకొని గాల్లో పావురాలు వదులుతున్న ఇద్దరు వ్యక్తులను అలుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చేశామన్నారు. పరిగి శివారులో పావురాలతో రేసింగ్ నిర్వహిస్తున్న చేసి విచారణ చేస్తున్నామని చెప్పారు. 100 కిలోమీటర్లు ప్రైజ్ మనీ..తర్వాత 200 కిలోమీటర్ల ప్రైస్ మనీ..తర్వాత 300 కిలోమీటర్ల ప్రైస్ మనీ ఇలా బెట్టింగులకు పాల్పడుతున్నారు. పరిగి నుంచి సత్యసాయి జిల్లా గోరంట్ల గ్రామానికి సరిగ్గా 300 కిలోమీటర్లు ఉండడంతో..ఈ పందెంలో పరిగి పట్టణాన్ని ఎంచుకొని ఇక్కడి నుంచి 300 పావురాలను వదలాలని చెప్పడంతో ముందుగా రెండు బాక్సులలోని 30 పావురాలను ఇద్దరు వ్యక్తులు గాల్లో వదిలినట్లు పోలీసులు తెలిపారు. మిగతా 250 పావురాలు బాక్సులలో ఉన్నాయని పోలీసులు చెప్పారు.కాగా.. ఇద్దరు వ్యక్తులపై గేమింగ్ యాక్ట్,బర్డ్స్ క్రుయాల్టీ యాక్ట్ లా కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు చెప్పారు.పట్టుకున్న 280 పావురాలను వదిలే విషయం కోర్టు నిర్ణయిస్తుందని సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



# వినాయక నిమజ్జనాన్ని దృష్టిలో పెట్టుకొని మెట్రో పిల్లర్స్ నిర్మించాలి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మెట్రో రైల్ నిర్మాణ సంస్థ ప్రతినిధులను కలిశారు. హైదరాబాద్ పాత బస్తీలో మెట్రో రైల్ విస్తరణలో భాగంగా ప్రధాన రహదారి లాల్ దర్వాజా మోడ్ పరిసరాలలో ఏర్పడే మెట్రో స్టేషన్స్ సంబంధించి నిర్మించే మెట్రో పిల్లర్స్ ఎత్తు విషయంలో వినాయక నిమజ్జనాలు దృష్టిలోకి తీసుకొని వినాయక విగ్రహాలుకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని పిల్లర్ ఎత్తు పెంచాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి శశిధర్, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఛైర్మెన్ కళ్లెం నిరంజన్ రెడ్డి, సాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొనడం జరిగినది.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రోజు డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ , డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు..కేసుల వివరాలను,రిజిస్టర్ లను పరిశీలించారు.గడువు అయిపోయిన మాత్రలను పరిశీలించాలని సూచించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.మండల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ లోని పెద్ద చెరువు కట్ట దగ్గర కోటి 80 లక్షల నిధులతో చేపడుతున్న క్రీడా ప్రాంగణము, కట్ట ఫెన్సింగ్ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్ రెడ్డి, కీసర గోవర్ధన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్ కుమార్, కార్పొరేటర్లు, కో - ఆప్షన్ సభ్యులు, బి.ఆర్.యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాల కార్మికుడి తో పనులు.. పెట్రోల్ బంక్ యజమాని పై కేసు నమోదు

### బాల కార్మికులు కనిపిస్తే డయల్100 కు సమాచారం ఇవ్వండి


### మండలం ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు

**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, వేములపల్లి:** బాల కార్మికునీతో పెట్రోల్ బంక్ లో పనులు చేయిస్తున్న బంక్ యజమాని పై కేసు నమోదు చేసిన ఘటన వేములపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారంగా.. బాల కార్మికుల నిర్మూలనకై ప్రతి ఏడాది జనవరి 1 తారీఖు నుండి 31 వ తారీకు వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్-%శ×% తనిఖీల్లో భాగంగా ఆపరేషన్ స్మైల్ టీం ఎస్ఐ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నల్గొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని శెట్టిపాలెం గ్రామం నార్కట్ పల్లి - అద్దంకి రహదారి పై ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లో బాల కార్మికుని తో పనులు చేయిస్తున్నట్లు గుర్తించారు. పెట్రోల్ బంక్ యజమాని శాగా జయేందర్ రెడ్డి(మిర్యాలగూడ మొదటి వార్డ్ కౌన్సిలర్) పై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా బాల కార్మికులతో పనులు చేపిస్తున్నట్లు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసిన లేదా స్థానిక పోలీస్ లకు సమాచారం తెలపాలని విజ్ఞప్తి చేశారు...

# భద్రత మాసం పురస్కరించుకొని వాహనా తనిఖీలు

### రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి : ఇన్స్పెక్టర్ నాగరాజు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాలని సిగ్నల్ బోర్డులను గమనిస్తూ వాహనాలు నడపాలని మీర్పేట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. రాచకొండ కమీషనర్ అఫ్ పోలీస్ ఆదేశానుసారం జాతీయ రోడ్డు భద్రతా మాసాన్ని పురస్కరించుకుని శనివారం నాడు సాయంత్రం సమయంలో మీర్ పేట పోలీస్ స్టేషన్ ఏరియాలోని మీర్పేట్ చౌరస్తా, బడ%శీ%గ్ పేట్ కొత్త మునిసిపల్ కార్యాలయం దగ్గర వాహనాల తనిఖీ చేయటం జరిగింది. వాహనాల తనిఖీలో భాగంగా సీటు బెల్ట్ లేకుండా వాహనం నడుపువారికి, హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ లను నడుపు వారికి తగు జాగ్రత్తలు తెలిపి, బెల్ట్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిగే నష్టాల గురించి వివరించి, తగు సూచనలు చేయటం జరిగింది. ఈ వాహన తనిఖీలో సబ్ ఇన్స్పెక్టర్ సారంగపాణి, సుధాకర్, సిబ్బంది పాల్గొనటం జరిగింది.




# ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఉద్యమించాల్సిన బాధ్యత మాదిగ విద్యార్థులదే

### ఎంఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మెక్కా సాయి మాదిగ

**బాన్సువాడ క్రైమ్ మిర్రర్:** భారత అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీంకోర్టు ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మాదిగ,మాదిగ ఉప కులాలను మోసం చేస్తున్నాడని,ఆ మోసకారి రేవంత్ ప్రభుత్వంపై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగ విద్యార్థులు యుద్ధ సైనికులై ఉద్యమించాలని ఎం ఎస్ ఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మెక్కా సాయి మాదిగ అన్నారు.ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తూ రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.ఇప్పటికే టీచర్ ఉద్యోగ నియామకాల్లో మాదిగ,మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోయాయని,గ్రూప్ వన్,గ్రూప్ టూ,గ్రూప్ త్రీ మరియు హాస్టల్స్ వార్డెన్ తదితర ఇతర ఉద్యోగ నియామకాల పరీక్షలు నిర్వహిస్తూ ఎస్సి కోటాలో ఉన్న ఉద్యోగాలను మాదిగలకు దక్కకుండా మాలలకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్ ప్రభుత్వంపై మాదిగ విద్యార్థులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని,మన ఉద్యోగాల కోసం హక్కుల కోసం భవిష్యత్తు కోసం యుద్ధ సైనికులుగా మారి వర్గీకరణను అమలు చేయించుకోవాలని కోరారు.ఎస్సీ వర్గీకరణను తక్షణమే రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ,మందకృష్ణ మాదిగ తీసుకునే ఉద్యమ కార్యాచరణకి విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఉద్యోగ నియామకాల పరీక్షలు నిర్వహిస్తూ ఎస్సి కోటాలో ఉన్న ఉద్యోగాలను మాదిగలకు దక్కకుండా మాలలకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం పై మాదిగ విద్యార్థులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని మన ఉద్యోగాల కోసం హక్కుల కోసం భవిష్యత్తు కోసం యుద్ధ సైనికులుగా మారి వర్గీకరణను అమలు చేయించుకోవాలని కోరారు.ఎస్సీ వర్గీకరణను తక్షణమే రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ తీసుకునే ఉద్యమ కార్యాచరణకి విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.



**తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి**

(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)



# సాగు చేసే ప్రతి భూమికి సంక్రాంతి నుండి రైతు భరోసా...!

**వికారాబాద్ నియోజకవర్గానికి 12 వేల ఇండ్లు మంజూరు...!**

**రూ.70 లక్షలతో చేపట్టే పనులు ప్రారంభించి..కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పంపిణి చేసిన స్పీకర్...!**

**ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుంది...!**

**శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్..!**





క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు పని చేస్తానని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సభాపతి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూనే, కొత్తగా నూతన పథకాలను తీసుకువస్తూ ప్రజల సంక్షేమ, అభివృద్ధి దిశగా ప్రభుత్వ పని చేస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసాలో భాగంగా పరిమితి లేకుండా సాగు చేసే ప్రతి భూమికి సంక్రాంతి నుండి రైతు భరోసాను వర్తింప చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధి హామీ కార్డు ఉన్న లబ్ధిదారులకు 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కూడా అందజేయనున్నట్లు సభాపతి తెలిపారు.వికారాబాద్ నియోజకవర్గానికి 12 వేల ఇండ్లు మంజూరు అయ్యాయని, మరో విడతలో కూడా ఇంకా ఇల్లు మంజూరు అవుతాయని తెలిపారు.నియోజకవర్గంలో ఇంటి స్థలం లేని వారిని గుర్తించి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం గావించి అందజేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం పైన,మాపైన ప్రజల ఆశీస్సులు, దేవుని దీవెనలు ఉండేలా ప్రార్థించాలని సభాపతి కోరారు. ముందుగా మార్కెట్ కమిటీ భవన ఆవరణలో 70 లక్షల వ్యయంతో చేపట్టే పనులకు ప్రారంభోత్సవం గావించారు.ఇందులో వ్యవసాయ మార్కెట్ కమిటీ భవన మరమ్మతులు,మార్కెట్ యార్డులో షెడ్ లకు,కార్యాలయానికి విద్యుద్దీకరణ మరమ్మత్తు పనులు చేపట్టనున్నారు.ముందుగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అంబేద్కర్,తెలంగాణ తల్లి చిత్రపటాలకు సభాపతి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ సిబ్బంది సభాపతికి నాగలిని బహుకరించారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, ఆర్డీవో వాస్తు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ పర్సన్ ఇంచార్జ్ ఎండి రియాజ్, కార్యదర్శి ఎండి ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## చిత్తు బొత్తు ఆడుతున్న ఏడుగురి పై కేసు నమోదు..!

**జగిత్యాలజిల్లా ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామ శివారులో చిత్తుబొత్తు ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు గొల్లపల్లి ఎస్ ఐ సతీష్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. వారిలో కొంత మంది పారిపోగా.పోలీసులు ఏడుగురిని పట్టుకుని వారి వద్ద నుండి 70100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మీర్పేట్ ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల ఒకటిన జిల్లెలగూడకు చెందిన కూరెళ్ల కనకాచారి తండ్రి యాదగిరి తన అన్న కొడుకు కూరెళ్ల అనిల్ కుమార్ తో సాయంత్రం 6 గంటల 30 నిమిషాల సమయంలో జిల్లెలగూడ గూడ బీజేపీ క్వార్టర్స్ చికెన్ షాప్ దగ్గర నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం అనిల్ కుమార్ ని ఢీకొట్టడంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయని, నాలుగవ తేదీ ఉదయం 8 గంటల సమయంలో అనిల్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఘటన స్థలానికి వెళ్లి చుట్టుపక్కల వారిని విచారించి అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా బాలాపూర్ చౌరస్తా వైపు నుండి మందమల్లమ్మ చౌరస్తా వైపుకు వెళ్లే ఒక గుర్తు తెలియని ద్విచక్ర వాహనం అనిల్ కు టక్కరిచ్చి ఆపకుండా వెళ్ళిపోయినదని, సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని కేసు దర్యాప్తు లో ఉన్నదని ఇన్స్పెక్టర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు.


## అనధికార నిర్మాణాలపై చర్యలు తప్పవు : బడంగ్పేట్ కమిషనర్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని, తమ నిర్మాణ పనులను సంబందిత ఆదికారుల నుండి అనుమతి తీసుకోవాలని అనుమతి లేకుండా ఎవరైనా నిర్మాణాలు చేపట్టినచో అట్టి నిర్మాణాలపై శాఖ పరమైన చర్యలు తీసుకొనబడతాయని బడంగ్పేట్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతి తెలిపారు.

## టెలి కమ్యూనికేషన్స్ అడ్వైజరీ డైరెక్టర్ గా షేక్ ఇమామ్

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** టెలి కమ్యూనికేషన్స్ అడ్వైజరీ డైరెక్టర్ గా ఖమ్మం నియోజకవర్గం నుండి ఖమ్మం నగరం కు చెందిన ముస్లిం మైనార్టీ నేత షేక్ ఇమామ్ భాయ్ ని నియమించారు.నిన్న ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రధాన అనుచరుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా షేక్ ఇమామ్ భాయ్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి టెలి కమ్యూనికేషన్ అడ్వైజర్ మెంబెర్ గా నాకు బాధ్యతలు అప్పగించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎంపీ రఘురాం రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం నియోజకవర్గం ఖమ్మం నగరం పరిధిలో బిఎస్ఎన్ఎల్ / ల్యాండ్ లైన్ లో మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్ నాణ్యమైన సిగ్నల్స్ డేటా అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు.



# ఆన్‌లైన్‌లో బాధితుల నుంచి 1.40 లక్షలు దొంగలించిన సైబర్ క్రైమ్ నేరగాళ్లు

**గండిపేట్(క్రైం మిర్రర్):** ఆన్లైన్ మోసాలు రోజు రోజుకు అధికం అవుతున్నాయని వీటి నుంచి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నార్సింగి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదర్షాకోట్ గంధంగూడ ప్రాంతానికి చెందిన బాధితుడిని ఆన్లైన్ ద్వారా ఓ అజ్ఞాత వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. అతడు సంగమేశ్వర గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తున్నాని తెలిపాడు. బాధితుడి భార్య మహిళా డ్వాక్రా గ్రూప్‌లో సభ్యురాలిగా ఉన్నారని ఆమె తీసుకున్న రుణం మాఫీ అయ్యిందని చెప్పి దానికి సంబంధించిన వడ్డీ మొత్తాన్ని ఆమె ఖాతాలో జమ చేస్తామని చెప్పాడు. ఆ తరువాత బాధితుడికి ఫోన్ పేకి పేమెంట్ రిక్వెస్ట్ పంపి లింక్‌పై క్లిక్ చేసి పాస్వర్డ్ ఎంటర్ చేయమని చెప్పగా బాధితుడు వారి సూచనలను అనుసరించి డబ్బును పోగొట్టుకున్నాడు. ఇదే విధంగా మరో ముగ్గురు మహిళలతో కూడా ఆన్‌లైన్‌లో డబ్బులు దోచుకున్నాడు. ఈ విధంగా బాధితుల నుంచి మొత్తం రూ.1,40,059 రూపాయల ఆన్‌లైన్ ద్వారా నిందితుడు దొంగలించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎటువంటి అజ్ఞాత వ్యక్తి మనకు పరిచయం అయి బ్యాంకు మేనేజర్ లేదా అధికారికవ్యక్తిగా మాట్లాడడం అనేది ఒక నష్టపరిస్థితికి దారి తీస్తుందన్నారు. ఎప్పుడు అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చిన కాల్స్ లేదా సందేహాలకు స్పందించకుండా ఉండాలన్నారు. ఫోన్ పే లేదా ఇతర పేమెంట్ లింకుల ద్వారా అనుమానితమైన సమాచారాన్ని అడిగితే, దానిపై క్లిక్ చేసి పాస్‌వర్డ్ ఇవ్వవద్దు అన్నారు. ఎటువంటి ఆఫర్లతో లేదా పేమెంట్ లింక్‌లతో వసేస్త వాటిని క్రోమ్ లేదా ఫోన్‌లో ఉండే పేమెంట్ పద్ధతుల్లో నుంచి మాత్రమే చేసుకోవాలన్నారు. బ్యాంకు లేదా నిత్యప్రమోజన సంస్థల నుంచి ఈ రకమైన విషయాలు వసేస్త వారి అధికారిక నెంబర్ లేదా వెబ్‌సైట్ ద్వారా వివరాలు సత్యపిస్తే అలాగే సందేహాలను క్లియర్ చేస్తే, జాగ్రత్త తీసుకోవచ్చునన్నారు. ఈ రకమైన ప్రాడ్ నుంచి రక్షించుకోవడానికి జాగ్రత్తగా ఉండాలన్నారు.

## కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ మరియు కోర్టు లైసెన్ ఆఫీసర్స్ తో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసిన సిపి

**నిందితులకు శిక్ష పడటం లో కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనది**

**కన్వెక్షన్ రేట్ పెంచాలి : పోలీస్ కమీషనర్ శ్రీ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్.,**



**క్రైమ్ మిర్రర్ 5 జనవరి పెద్దపల్లి :** కోర్టు డ్యూటీ ఆఫీసర్ లు నేరస్థులు శిక్షల నుండి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్షలు పడుటకు కృషి చేయాలని రామగుండము పోలీస్ కమీషనర్ శ్రీ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్.,(ఐజి) అన్నారు. రామగుండము పోలీస్ కమీషనరేట్ పరిదిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిదిలోని పోలీస్ స్టేషన్ లలో పనిచేస్తున్న కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ మరియు కోర్టు లైసెన్ ఆఫీసర్స్ తో కమీషనరేట్ లో సిపి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ... గౌరవ కోర్ట్ లలో అండర్ ట్రయల్ ఖైదీలని జైలు నుండి పోలీసు ఎస్కార్ట్ ద్వారా తగు జాగ్రత్తలు తీసుకొని మరియు జైల్ అథారిటీస్, గౌరవ కోర్టు స్టాఫ్ మరియు సంబధిత అధికారులతో సమన్వయ%శీ% తో గౌరవ కోర్ట్ లో యందు ప్రవేశపెట్టాలని అదేవిధంగా నేరస్థులకు శిక్ష పడే విధంగా సాక్షలను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగే విధంగా చూడాలని సిపి గారు కోర్టు లైజన్ మరియు కోర్టు డ్యూటీ అధికారులకు సూచించడం జరిగింది. నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలని సూచించారు. పెండింగ్, పెట్టి కేసులు వెంటనే డిస్పోజల్ చేయాలని, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. నేరస్తులకు శిక్షలు పడేవిధంగా కృషిచేయాలని, కన్విక్షన్ రేటును పెంచాలని అన్నారు. కోర్టు నందు ఎఫ్ఐఆర్ లను సరైన సమయంలో అందించాలని కేసుల్లో ఉన్నటువంటి ప్రాపర్టీని సరైన సమయంలో కోర్టు నందు డిపాజిట్ చేయాలి. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషిచేయాలని, నేరస్తులకు వారంట్స్, సమన్స్, సత్వరమే ఎగ్జిక్యూటివ్ అయ్యే విధముగా చర్యలు తీసుకోవాలని, కోర్టు ప్రాసిక్యూషన్ కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియజేయాలని, కేసు ట్రయల్స్ సమయములో పబ్లిక్ ప్రాసిక్యూటర్ యొక్క సలహాలు సూచనలు పాటించాలని, కోర్టు పెండింగ్ ట్రయల్ కేసులు, వారెంట్స్, సమన్స్, సి.సి.టి.యన్.యస్ లో ( కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్) లో డాటా ఎంటర్ చేయాలని సూచించారు.కోర్టులో డిస్పోజలైన కేసులను (%ూఎనబఙ్ఖుశ్రీ, ఖఙ్ఱశీఅ ఖఝ్ఙవఎ, ఖఎఱంంఱశీఅ, ఎశీఏజూతీశీఏఱంవస శ్రీశీని ఖఝుశ్రీఙ్ష్త్ర, ఎశీఅజఱఅ్ఙఱశీఅ జూఖతీఅఎబశ్రీఖతీం, ఱఅంఎష్త్రుతీస్త్రవస, ాబంష్త్రవస, ఔఙ్ష్త్రసతీఖఝుశ్రీం,) జూజు% ( సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ) లింకు నందు తప్పకుండ అప్లోడ్ చేయవలెను. కోర్టు నందు ట్రయల్ జరిగిన కేసులు ఎంటర్ చేసినచో పెండింగ్ లేకుండా వుంటుందని తెలిపారు. భాదితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, భాదితులకు మరింత నమ్మకం పెరిగేలా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని సూచించారు.అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు , ఎసిపి ప్రతాప్, సురేంద్ర, లీగల్ సెల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సిసి ఆర్ బి ఇన్స్పెక్టర్ సతీష్, పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ల కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## టెలి కమ్యూనికేషన్స్ అడ్వైజరీ డైరెక్టర్ గా రంజిత్ నాయక్



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** టెలి కమ్యూనికేషన్స్ అడ్వైజరీ డైరెక్టర్ గా పాలేరు నియోజకవర్గం నుండి ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురం కి చెందిన బానోత్ రంజిత్ నాయక్ ని నియమించారు.నిన్న ఎంపి క్యాంప్ ఆఫీసులో ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాంరెడ్డి చేతుల నియామక పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా రంజిత్ నాయక్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి టెలి కమ్యూనికేషన్ అడ్వైజర్ మెంబెర్ గా నాకు బాధ్యతలు అప్పగించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎంపీ రఘురాం రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.పాలేరు నియోజకవర్గం పరిధిలో బిఎస్ఎన్ఎల్ మొబైల్ లో ల్యాండ్ లైన్ సర్వీసులు నాణ్యవంతమైన సేవలందించేందుకు బిఎస్ఎన్ఎల్ కస్టమర్ల పెంపు కి నా వంతు కృషి చేస్తానని తెలిపారు.

## నూతన సంవత్సరం లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా కానుక

**మాట తప్పం - మడమ తిప్పం - పక్కగా అమలు చేస్తాం౦ మాజీ ఎమ్మెల్యే కె ఎల్ ఆర్**

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీ**

**కాంగ్రెస్ కు ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధతకు బీజేపీ,బీఆర్ఎస్ కళ్లు తెరవాలి౦ కేఎల్ఆర్**



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షనీయమని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.కేబినెట్ నిర్ణయాలన్నీ గతంలో కాంగ్రెస్ సహా పాదయాత్రలో రేవంత్ రెడ్డి భట్టి విక్రమార్,ఇచ్చిన హామీలను పక్కగా అమలు చేస్తున్నామని గుర్తు చేశారు.రైతు భరోసాను రూ 12వేల నుంచి 15వేలకు పెంచామని... కొత్త రేషన్ కార్డులను అర్హులందరికీ ఇస్తామని ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజానీకానికి భరోసా ఇచ్చారని మీడియా ప్రకటనలో కె ఎల్ ఆర్ తెలిపారు.ఈ పథకాలను జనవరి 26 నుంచి అమలు చేసి 75 ఏళ్ల రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుతామన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారెంటీలు సహా అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు గ్రామ సభల ద్వారా వివరిస్తామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ౦ కె ఎల్ ఆర్ ప్రకటించారు.ప్రభుత్వ నిర్ణయం వల్ల మహేశ్వరం నియోజకవర్గంలో వేలాది మంది రైతులు, బడుగు, బలహీన వర్గాలకు ఎంతో ఆర్థికంగా లాభదాయకం కానుందని కె ఎల్ ఆర్ సంతోషం వ్యక్తం చేశారు.రైతాంగం పట్ల కాంగ్రెస్ కు ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధతకు బీజేపీ,బీఆర్ఎస్ కళ్లు తెరవాలని కేఎల్ఆర్ సూచించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# బిజినెస్

7

ఆదివారం

5-1-2025



## పటిష్ట స్థితిలో భారత్.. మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా

న్యూఢిల్లీ: సైనిక శక్తి, రాజకీయ సుస్థిరత, బలమైన ప్రజాస్వామ్యం తదితర అంశాల దన్నుతో అంతర్జాతీయంగా భారత్ పటిష్టమైన స్థితిలో ఉందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు. అవకాశాలను అందిపుచ్చుకుని, మరింతగా ఎదిగే సత్తా దేశానికి ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య భాగస్వామ్యాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, అనిశ్చితులను.. భారత్ అవకాశాలుగా మల్చుకోవచ్చని మహీంద్రా చెప్పారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కీలక భాగంగా మారొచ్చని నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన సందేశంలో ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరత ప్రభావం ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌పై తక్కువగా ఉంటుందని మహీంద్రా తెలిపారు. తమ గ్రూప్ అధిగమించిన కీలక మైలురాళ్లను ప్రస్తావిస్తూ .. అత్యంత విలువైన వాహనాల తయారీ దిగ్గజంగా ప్రపంచంలోనే 11వ స్థానానికి చేరడం, ఎలక్ట్రిక్ వాహనాలు అంచనాలకు మించి విజయవంతం కావడం గర్వించతగ్గ విషయాలని ఆయన పేర్కొన్నారు. గ్రూప్‌లోని ఇతర కంపెనీల పనితీరును కూడా ప్రశంసించారు. ఆకాంక్షలను సాకారం చేసుకోగలమనే స్ఫూర్తితో భవిష్యత్తుపై ఆశావహంగా ఉండాలని సూచించారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచకుంటే సమ్మెకు సిద్ధం



### యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ముందు కార్మికులతో కలిసి దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్, ఫిక్స్ ఢ్ ఫే, తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలని రెండవ పిఆర్సి లో కనీస వేతనం 26,000 నిర్ణయించాలని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో ఇస్తున్నట్లుగా 21,000 వేతనం అమలు చేయాలని, కేటగిరీల వారిగా వేతనాలు, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి ఈఎస్ఐ పీఎఫ్ లలో జరుగుతున్న అవకతవకలను నివారించాలని, కార్మికులందరికీ వారాంతపు సెలవులను మరియు లేబర్ డిపార్ట్మెంట్ ప్రతిపాదించిన జాతీయ సెలవులన్నింటిని కార్మికులందరికీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కొత్త కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు అమలు చేసి క్రమం తప్పకుండా ప్రతి నెల ఇవ్వాలని, కార్మికుల వయస్సు పైబడిన, అనారోగ్యానికి గురైన, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని,పై సమస్యల పరిష్కారం కోరుతూ 48 గంటల పాటు మున్సిపాలిటీల ముందు దీక్షలు జనవరి 6వ తేదీన కలెక్టరేట్ ముట్టడికి కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దాసరి బాబు, శేఖర్ యాదవ్ మున్సిపల్ కార్మికులు భారతమ్మ అంజూర యాదమ్మ యాదగిరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## యువకుల మరణాలకు కారణం అవుతున్న బెల్ట్ షాపులు

### మీర్పేట్, ఆదిభట్ల, బాలాపూర్ పోలీసులు బెల్టు షాపులపై నియంత్రణ చేపట్టాలి : ఇబ్రం శేఖర్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పడి ఉదయం నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు కొనసాగుతున్న బెల్ట్ షాపులపై పోలీసులు నియంత్రణ చేపట్టాలని తెలిపిన బడంగ్పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ బిఎస్పి పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ ఇబ్రం శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ కార్పొరేషన్ లో ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్న 35 సంవత్సరాల యువకుడు ఆకస్మిక మరణానికి మద్యపానమే కారణమని దీనివలన అతని భార్య ఇద్దరు పిల్లల భవిష్యత్తు ఏమిటని, గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఉదయం నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు బెల్ట్ షాపుల నిర్వాహనతో యువత మద్యానికి బానిస కావడం జరుగుతుందని ఇందులో ముఖ్యంగా అణగారిన వర్గాల కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నారని ఉచిత విద్య ఉచిత ఆరోగ్యం అందించలేకపోతున్న ప్రభుత్వాలు కనీసం ప్రజల ఆరోగ్యలపై శ్రద్ధ పెట్టాలని అభివృద్ధి పనులు పైనే కాకుండా ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్న బెల్ట్ షాపులపై నియంత్రణ చేపట్టే విధంగా స్థానిక నాయకులే కాకుండా మేయర్ ఎమ్మెల్యే కూడా దృష్టి పెట్టాలని ఇప్పటికైనా పోలీసులు ఎక్సైజ్ సిబ్బంది బెల్ట్ షాపులపై నియంత్రణ పెట్టాలని లేనిచో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లే విధంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రజా ప్రతినిధులుగా ఉన్న మనం ప్రజల ఆరోగ్యం కోసం చర్యలు చేపట్టాలని బెల్ట్ షాపులతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత మద్యానికి బానిసలై తమ జీవితాలే పాడు చేసుకోవడం కాకుండా వారి కుటుంబాలు కూడా వీధిన పడుతున్నాయని ఇప్పటికైనా అధికారులు అందరూ బెల్ట్ షాప్ లపై నియంత్రణ చేపట్టాలని తెలిపారు.

## తీరు మారేదే..లే ఆగని రూపాయి పతనం



ముంబై, జనవరి 2: భారతీయ కరెన్సీ రూపాయి.. డాలర్ ముందు తేలిపోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపీ మారకపు విలువ రోజుకింత దిగజారుతూ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పతనమవుతున్నది. గురువారం మరో 11 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోల్చితే ఎక్స్ఛేంజ్ రేటు 85.75 వద్దకు క్షీణించింది. దీంతో ఈ ఏడాది రపాయికి తొలి నష్టం ఎదురైనైట్టెంది. ఇంట్రా-డేలోనైతే 85.79కి పడింది. ఇక బుధవారం స్థిరంగా ఎక్కడిదక్కడే ఉన్న విషయం తెలిసిందే.కాగా, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్, దేశీయ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు ట్రేడర్లు చెప్తున్నారు. కాగా, ఈ 2025లో ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతలు తక్కువేనన్న సంకేతాలు, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాబోతుండటంతో పరుగులు పెడుతున్న డాలర్ ఇండెక్స్, అమెరికా పదేండ్ల బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడం వంటివి భారతీయ కరెన్సీని మరింత ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. రూపాయి పత నం దేశ ఆర్థిక వ్యవస్థకూ ఇబ్బందే. ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు, జీడీపీ పతనం వంటి దుష్పరిణామాలకు దారితీస్తుంది.

## విద్యుత్ ప్రమాదంతో రూ.50 వేలు ఆస్తి నష్టం



**క్రైమ్ మిర్రర్,నాంపల్లి :** నాంపల్లి మండలం పరిధిలోని నేమిళ్ల గూడెం గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ ఇంట్లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం అకస్మాత్తుగా విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, నిత్యవసర సరుకులు బియ్యం, వట్టి మిరపకాయలు పలు రకాల సామాన్లు కాలి పోయినట్లు పేర్కొన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో 50,000 రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు కుటుంబీకులు తెలిపారు. అదృష్టం కొద్దీ ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. విద్యుత్ ప్రమాదంలో జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారులు పరిశీలించి ప్రభుత్వం తరపున మాకు సహాయం అందించగలరని కుటుంబ సభ్యులు కోరారు.

# పెట్రోల్, డీజిల్‌కు అధిక డిమాండ్



### డిసెంబర్‌లో పెరిగిన వినియోగం


### పెట్రోల్ అమ్మకాలు 10% అధికం

న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ వినియోగం డిసెంబర్ నెలలో గణనీయంగా పెరిగింది. క్రితం ఏడాది ఇదే నెలలోని వినియోగంతో పోల్చి చూస్తే, పెట్రోల్ అమ్మకాలు (ప్రభుత్వరంగ సంస్థల) 10 శాతం పెరిగి 2.99 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీలు బీపీసీఎల్, ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్ ద్వారా 90 శాతం ఇంధన విక్రయాలు నడుస్తుంటాయి. క్రితం ఏడాది డిసెంబర్ నెలలో పెట్రోల్ అమ్మకాలు 2.72 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. డీజిల్ అమ్మకాలు సైతం 4.9 శాతం పెరిగి 7.07 మిలియన్ టన్నులకు చేరాయి. నవంబర్ నెలలోనూ పెట్రోల్, డీజిల్ వినియోగం క్రితం ఏడాది ఇదే నెల గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 8.3 శాతం, 5.9 శాతం చొప్పున పెరగడం గమనార్హం. వరుసగా రెండో నెలలోనూ వృద్ధి నమోదైంది. డిసెంబర్‌లో క్రిస్‌మస్ సెలవుల సందర్భంగా పర్యటనలు పెరగడం, ఖరీఫ్ సాగు సందర్భంగా యంత్రాలకు ఇంధన వినియోగం పెరగడం వినియోగంలో వృద్ధికి దారితీసింది.

ఇక ఈ ఏడాది నవంబర్ నెల విక్రయాలతో పోల్చి చూస్తే డిసెంబర్‌లో పెట్రోల్ అమ్మకాలు 3.6 శాతం, డీజిల్ అమ్మకాలు 1.7 శాతం చొప్పున తక్కువగా ఉండడం గమనార్హం. దేశ ఇంధన మార్కెట్లో 40 శాతం డీజిల్ రూపంలోనే వినియోగం అవుతుంటుంది. ముఖ్యంగా 70 శాతం డీజిల్‌ను రవాణా రంగం వినియోగిస్తుంటుంది. ఆ తర్వాత వ్యవసాయ రంగంలో డీజిల్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇక విమానయాన ఇంధనం (ఏటీఎఫ్) అమ్మకాలు డిసెంబర్ నెలలో క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చితే 6.8 శాతం పెరిగి 6,96,400 టన్నులుగా ఉన్నాయి. వంటగ్యాస్ (ఎల్‌పీజీ) వినియోగం 5 శాతానికి పైగా పెరిగి 2.87 మిలియన్ టన్నులకు చేరింది.

## పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన: కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మునుగోడు నియోజకవర్గం నాంపల్లి మండలం కేంద్రానికి చెందిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కర్నాటి విద్యాసాగర్ మాతృమూర్తి పార్వతమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్ పార్వతమ్మ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. వారితో పాటు కాట్రోత్ భిక్ష పతి నాయక్, సాగర్, శ్రీరామ్ నాయక్ నెట్టు శ్రీకాంత్, పర్వతాలు తదితరులు నివాళులర్పించారు.



# రసపట్టులో.. పంత్ ధనాధన్ ఇన్నింగ్స్



బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య సిడ్నీ వేదికగా ఐదో టెస్టు రసపట్టులో పడింది. ఆధిక్యం చేతులు మారుతున్న మ్యాచ్‌లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై బౌలర్లు వికెట్ల పండుగ చేసుకుంటున్నారు. రెండో రోజైన శనివారం ఆటలో 15 వికెట్లు నేలకూలాయి. బోలాండ్ ధాటికి టీమ్ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో 141 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. రిషబ్ పంత్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో కంగారూలకు ముచ్చెమటలు పట్టించాడు. టాపార్డర్ మరోమారు ఘోరంగా విఫలం కాగా,పంత్ ఒంటరిపోరాటం జట్టుకు కలిసొచ్చింది. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా పంత్ కొట్టిన షాట్లకు కిక్కిరిసిన సిడ్నీ స్టేడియం హోరెత్తిపోయింది. అంతకుముందు ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్, నితీశ్, బుమ్రా విజృంభణతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు పరిమితమైంది. అరంగేట్రం బ్యాటర్ వెబ్‌స్టర్ అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, మిగతావారు విఫలమయ్యారు. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న టీమ్ఇండియా ప్రస్తుతం 145 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. మూడు రోజుల ఆట మిగిలున్న మ్యాచ్‌లో విజయం ఎవరిదో అన్నది ఆసక్తికరగా మారింది.

**హోరాహోరీగా భారత్, ఆసీస్ సిడ్నీ పోరు**

**రెండో ఇన్నింగ్స్ 141-6**

**రాణించిన సిరాజ్, ప్రసిద్ధ్, నితీశ్**

**ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 181 ఆలౌట్**

సిడ్నీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో ఆఖరిదైన ఐదో టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. మ్యాచ్‌కు ముందే ఆసక్తి రేపిన పోరులో భారత్, ఆస్ట్రేలియా తుదికంటా పోరాడుతున్నాయి. మ్యాచ్ గెలిచి సిరీస్ డ్రా చేయడం ద్వారా బీజీటీ ట్రోఫీని నిలబెట్టుకోవడంతో పాటు డబ్ల్యూటీసీ టోర్నీ రేసులో నిలువాలని టీమ్ఇండియా పట్టుదలతో ఉంది. మరోవైపు గత రెండు పర్యాయాలు సిరీస్ కోల్పోయిన ఆసీస్ ఈసారి ఎలాగైనా కసితీర్చుకోవాలని చూస్తున్నది.తద్వారా డబ్ల్యూటీసీకి బెర్తు దక్కించుకోవాలన్న ఆరాటంతో ఉంది. ఈ నేపథ్యంలో రెండు జట్లు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. వికెట్‌కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్(33 బంతుల్లో 61, 6ఫోర్లు, 4సిక్స్‌లు) సుడిగాలి అర్ధసెంచరీతో రాణించడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 141-6 స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు రాహుల్(13), గిల్(13), కోహ్లీ(6) మరోమారు విఫలమైన వేళ తాను ఉన్నానంటూ పంత్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఈ క్రమంలో భారత్ తరఫున రెండో వేగవంతమైన(29 బంతుల్లో) అర్ధసెంచరీ రికార్డును పంత్ తన పేరిట లిఖించాడు. జడేజా(8), సుందర్(6) క్రీజులో ఉన్నారు. స్కాట్ బోలాండ్(4-42) టీమ్ఇండియా పతనాన్ని శాసించాడు. కమిన్స్, వెబ్‌స్టర్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 9-1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 181 పరుగులకు ఆలౌటైంది. వెబ్‌స్టర్(105 బంతుల్లో 57, 5ఫోర్లు), స్మిత్(33) ఆకట్టుకున్నారు. పిచ్ పరిస్థితులకు అనుకూలంగా మలుచకుంటూ ప్రసిద్ధ్ కృష్ణ(3-42), సిరాజ్(3-51), నితీశ్(2-32), బుమ్రా(2-33) ఆసీస్ పతనంలో కీలకమయ్యారు. సీనియర్లు విఫలమైన చోట ఆడుతున్న తొలి మ్యాచ్‌లోనే వెబ్‌స్టర్ అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. నాలుగు పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్ఇండియాకు ఓపెనర్ యశస్వి జైస్వాల్(22) మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. స్టార్క్ తొలి ఓవర్‌లోనే హ్యాట్రిక్ బౌండరీలతో తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. స్టార్క్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ జైస్వాల్ చూడచక్కని షాట్లతో అభిమానులను అలరించాడు. అయితే మరో ఎండ్‌లో రాహుల్ అంతగా ఆకట్టుకోలేకపోయాడు. క్రీజులో కుదురుకునేందుకు సమయం తీసుకున్న రాహుల్..జైస్వాల్‌కు తోడ్పాటు అందించాడు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన బోలాండ్..రాహుల్‌ను సూపర్ స్వింగ్‌తో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఇక్కడి నుంచి మన పతనానికి నాంది పడింది. ఐదు పరుగుల తేడాతో రాహుల్‌ను అనుసరిస్తూ జైస్వాల్ కూడా బౌల్డ్ కావడంతో 47 పరుగులకే టీమ్ఇండియా ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. రోహిత్‌శర్మ స్థానంలో జట్టులోకి వచ్చిన గిల్(13) తన వికెట్ విలువను గుర్తించలేకపోయాడు. క్రీజులో నిలదొక్కుకోవాల్సింది పోయి అనవసరంగా వికెట్ సమర్పించుకున్నాడు. వెబ్‌స్టర్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయిన గిల్%ౌ%కీపర్ క్యారీ క్యాచ్‌తో ఔటయ్యాడు. గిల్ కంటే ముందు బోలాండ్ మరోమారు భారత్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. ఔట్‌సైడ్ ఆఫ్‌స్టంప్ బంతిని ఆడబోయిన కోహ్లీ..స్లిప్‌లో స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఈ సిరీస్‌లో ఏకంగా ఎనిమిదో సారి కోహ్లీ ఇదే శైలిలో వికెట్ ఇచ్చుకోవడం విశేషం. దీంతో 78 పరుగులకే టీమ్ఇండియా కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన పంత్..స్టార్క్ బౌలింగ్‌లో తొలి బంతినే కండ్లు చెదిరే రీతిలో సిక్స్ కొట్టి ఔరా అనిపించాడు. తన బ్యాటింగ్ శైలిపై వస్తున్న విమర్శలకు పంత్ అదే రీతిలో సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశాడు. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని నైజంతో, తన ట్రేడ్‌మార్క్ షాట్లు ఆడుతూ ఆసీస్ బౌలర్లను కంగారెత్తించాడు.పంత్ బ్యాటింగ్ ధాటికి ఒక దశలో కెప్టెన్ కమిన్స్ బౌండరీల వద్ద ఆరుగురు ఫీల్డర్లను మోహరించాల్సి వచ్చింది. ఏ మాత్రం ఒత్తిడికి గురికాని పంత్..భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. వెబ్‌స్టర్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌లు కొట్టిన పంత్..29 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. ఇక ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో కమిన్స్ బంతిని షాట్ ఆడబోయిన ఈ హార్డ్‌హిట్టర్ కీపర్ క్యాచ్‌తో వెనుదిరగాల్సి వచ్చింది. అప్పటి వరకు హోరెత్తిన స్టేడియం పంత్ ఔట్ కావడంతో నిశ్శబ్దం ఆవరించింది. ఆ తర్వాత వచ్చిన నితీశ్(4) మరోమారు ఘోరంగా విఫలమయ్యాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 185 ఆలౌట్, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 181 ఆలౌట్,


**భారత్ రెండో ఇన్నింగ్స్:** 141-6(పంత్ 61, జైస్వాల్ 22, బోలాండ్ 4-42, వెబ్‌స్టర్ 1-24)



## మరో స్టార్ జంట విడాకులు..?

### ఇన్‌స్టాలో ఒకరినొకరు అన్‌ఫాలో..!

భారత క్రికెట్ టీమ్‌లో మరో జంట విడాకులకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో రీల్స్‌తో ఫ్యాన్స్‌ను అలరిస్తున్న భారత స్టార్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ జంట విడాకులు తీసుకోబోతోందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రూమర్స్ నేపథ్యంలో తాజాగా ఈ జంట ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం పస్తుతం చర్చనీయాంశంగా మారింది.అంతేకాదు ధనశ్రీతో ఉన్న ఫొటోలను కూడా చాహల్ తొలగించాడు. మరోవైపు ఈ జంట విడిపోవడానికి నిర్ణయించుకున్నట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే విడాకులు తీసుకోబోతున్నారంటూ తెలిపాయి. అందుకు ఖచ్చితమైన కారణాలు మాత్రం చెప్పలేదు. విడాకులు అధికారికం కావడానికి మరికొంత సమయం పట్టొచ్చని పేర్కొన్నారు. చాహల్.. దంత వైద్యురాలైన ధనశ్రీ 2020 డిసెంబర్ 22న పెండ్లి చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది ధనశ్రీ. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తూనే ఉన్నారు. అయితే, ఇటీవలే ధనశ్రీ తన పేరు నుంచి 'చాహల్' నేమ్‌ను తీసేయడంతో ఈ జంట విడాకులు తీసుకోబోతోందంటూ పుకార్లు వ్యాపించాయి. ఆ తర్వాత చాహల్ సైతం 'న్యూ లైఫ్ లోడెడ్' అంటూ ఇన్‌స్టా స్టోరీస్‌లో రాసుకొచ్చాడు. దీంతో వీరు విడాకులు తీసుకోవడం ఖాయం అని ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే వీరు తమ సోషల్ మీడియా ఖాతాలో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో ఆ వార్తలకు మరింత ఆజ్యంపోసినట్లైంది. ఈ విడాకుల వార్తలపై క్లారిటీ రావాలంటే మరికొన్నిరోజులు ఆగాల్సిందే.



## బుమ్రాకు గాయం!

సిడ్నీ: భారత తాత్కాలిక కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా గాయపడ్డాడు. ఆస్ట్రేలియాతో ఐదో టెస్టు రెండో రోజు ఆటలో బుమ్రా వెన్నునొప్పికి గురవ్వడం ఒకింత ఆందోళనకు గురి చేసింది. భోజన విరామం తర్వాత ఒక ఓవర్ వేసిన బుమ్రా వెంటనే మైదానాన్ని వీడాడు. బుమ్రా స్థానంలో సర్ఫరాజ్‌ఖాన్ ఫీల్డింగ్‌కు రాగా విరాట్ కోహ్లీ స్టాండింగ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. జట్టు వైద్య సిబ్బందితో కలిసి బుమ్రా స్కానింగ్ పరీక్షలకు వెళ్లాడు. అయితే మ్యాచ్ జరుగుతున్నప్పుడే తిరిగి స్టేడియానికి చేరుకున్న స్టార్ స్పీడ్‌స్టర్ గాయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. 'ముందస్తు జాగ్రత్తగా బుమ్రా స్కానింగ్ పరీక్షలు నిర్వహిం చాం. అతను బ్యాటింగ్ చేసేందుకు పెద్దగా ఇబ్బందేమి లేదు. కానీ బౌలింగ్ చేయాలా వద్దా అనేది ఆదివారం తేలుతుంది' అని జ ట్టు వర్గాలు పేర్కొన్నాయి. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో ప్రస్తుతం బుమ్రా టాప్ వికెట్ టేకర్‌గా కొనసాగుతున్నాడు. ఆసీస్ బ్యాటర్లకు కొరకరాని కొయ్యగా వికెట్ల వేట సాగిస్తున్నా డు. ఒక వేళ గాయం తీవ్రతతో బౌలింగ్‌కు రాకపోతే..భారత గెలుపు అవకాశాలపై కచ్చితంగా ప్రభావం చూపిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## ఇప్పట్లో రిటైర్ కాను

### పుకార్లను అసలు పట్టించుకోను కెప్టెన్సీపై రోహిత్‌శర్మ స్పష్టత

సిడ్నీ: భారత స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మ..తన రిటైర్మెంట్ వార్తలపై స్పష్టత ఇచ్చాడు. ఆస్ట్రేలియాతో ఆఖరి టెస్టులో అనూహ్యంగా తప్పించడంపై రోహిత్ తనదైన శైలిలో స్పందించాడు. గత కొన్ని రోజులుగా వస్తున్న వరుస కథనాలకు హిట్‌మ్యాన్ చెక్ పెట్టాడు. రెండో రోజు ఆటలో విరామం సందర్భంగా రోహిత్ వ్యాఖ్యాలతో మాట్లాడుతూ 'నేను ఇప్పట్లో రిటైర్ కాను. ఫామ్‌లో లేను కాబట్టే చివరి టెస్టు నుంచి తప్పుకున్నాను. అంతేకానీ వేరే ఉద్దేశం లేదు. ఫామ్‌లో లేని ప్లేయర్‌ను ఏ జట్టు మోయలేదు. అందుకే నా స్థానంలో మెరుగైన ప్రదర్శన కనబరిచే ప్లేయర్ అవకాశం ఇచ్చారు.

ఇదే విషయాన్ని కోచ్, మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లాను. అంతేకానీ రిటైర్ అవుతున్నట్లు కొందరు అదే పనిగా వార్తలు రాస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు రాయడం సరైంది కాదు' అని అన్నాడు. అయినా తాను ఇక్కడికి వచ్చింది విశ్రాంతి తీసుకోవడానికి కాదు ఆడటానికే. సిడ్నీ టెస్టు నుంచి వైదొలుగాలనే నిర్ణయం కఠినమైనదైనా..జట్టు అవసరాల కోసం ఇది తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. '2007లో తొలిసారి డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చినప్పటికీ ఇప్పటి వరకు మ్యాచ్ గెలువాలనే చెబుతుంటాను. కొన్నిసార్లు జట్టుకు ఏం అవసరమో మనం అర్థం చేసుకోవాలి. జట్టు ప్రయోజనాలకు అనుగుణంగా మనం మారాల్సి ఉంటుం ది. ఫామ్‌లో లేకుండా జట్టులో కొనసాగడం సరైంది కాదు. జట్టుకు ఏది లాభిస్తుందో అది చేయాలి'అని హిట్‌మ్యాన్ పేర్కొన్నాడు.మరోవైపు పుకార్లపై స్పంది స్తూ 'ఎవరో ఏదో అనుకుంటున్నారని ఆలోచించే వ్యక్తిని కాదు. విమర్శల వల్ల కెప్టెన్సీ పద్ధతి మార్చుకోలేను.

GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

## మహా ఘనుడు...

### డేటింగ్ యాప్ ద్వారా 700 మంది మహిళను మోసం చేసిన యువకుడు

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** యూపీలోని నోయిడాకు చెందిన ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న తుషార్ సింగ్ బిస్త్ అనే 23 వ్యక్తి డేటింగ్ యాప్ ద్వారా సుమారు 700 మంది మహిళలను మోసం చేశాడు. మోడల్ అని చెప్పుకుంటూ అతను ఆ మోసాలకు తెగించాడు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తి చేసిన అతను.. గత మూడేళ్ల నుంచి ఓ కంపెనీలో టెక్నికల్ రిక్రూటర్‌గా చేస్తున్నాడు. అతని తండ్రి ఓ డ్రైవర్. తల్లి ఇంటికే పరిమితం. సోదరి గురుగ్రామ్‌లో పనిచేస్తుంది. తుషార్‌కు ఉద్యోగం ఉన్నా.. డబ్బు, మహిళల మీద మోజుతో సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. ఓ యాప్ ద్వారా విపిన్ మొబైల్ నెంబర్ తీసుకున్న అతను, పాపులర్ డేటింగ్ యాప్‌ల్లో ఫేక్ ప్రొఫైల్‌ను క్రియేట్ చేశాడు. బంబ్లీ, స్నాప్‌చాట్ లాంటి మీడియాల్లో అతను ఆ ప్రొఫైల్‌ను పెట్టాడు. ఇండియాకు విజిట్ చేస్తున్న అమెరికా ఫ్రీలాన్స్ మోడల్‌గా అతను ఐడీ క్రియేట్ చేశాడు. ఓ బ్రెజిల్ మోడల్ నుంచి చోరీ చేసిన ఫోటోలు, స్టోరీలతో అతను ఫేక్ ఐడీ సృష్టించాడు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య మహిళల్ని అతను టార్గెట్ చేసేవాడు. తొలుత ఆ అమ్మాయిలను స్నేహితులుగా మార్చుకుని .. మోసాలకు పాల్పడ్డాడు. అమ్మాయిల నుంచి నమ్మకం గెలిచిన తర్వాత వారి ఫోన్ నెంబర్లు తీసుకునేవాడు. ఆ తర్వాత ఫ్రెండ్‌షిప్ పేరుతో రహస్య ఫోటోలు, వీడియోలను అడిగేవాడు. ఆ తర్వాత ఆ విజువల్స్‌ను అతను తన ఫోన్‌లో సేవ్ చేశాడు. తొలుత వ్యక్తిగత సంతోషం కోసం చేసినా.. ఆ తర్వాత అతను బెదిరింపులకు పాల్పడ్డాడు. తన వద్ద ఉన్న వీడియోలను చూపించి డబ్బు కోసం బెదిరించేవాడు. ఒకవేళ ఎవరైనా డబ్బులు ఇవ్వనని బెదిరిస్తే, అప్పుడు అతను ఫోటోలు, వీడియోలను అప్‌లోడ్ చేస్తానని బెదిరించేవాడు. బంబ్లీ డేటింగ్ యాప్‌లో 500 మంది , స్నాప్‌చాట్‌లో 200 మంది అమ్మాయిలతో చాటింగ్ చేసేవాడు. అయితే ఢిల్లీ వర్సిటీ సెకండ్ ఇయర్ అమ్మాయిని సైబర్ మోసం చేసిన కేసులో అతను చిక్కాడు.

## వ్యవసాయంలో యాంత్రీకరణ అవసరం వ్యవసాయ మంత్రి అచ్చెనాయుడు



**గుంటూరు, (క్రైమ్ మిర్రర్):** వ్యవసాయంలో యాంత్రికరణ అవసరమని వ్యవసాయ మంత్రి అచ్చెనాయుడు అన్నారు. గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి అచ్చెన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. వ్యవసాయంపై కనీస దృష్టి పెట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. యాంత్రికరణను ప్రోత్సాహిస్తామని వెల్లడించారు. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయ రంగంలో ప్రవేశపెడతామని తెలిపారు. వ్యవసాయంలో భూసార పరీక్షలు అవసరమన్నారు. భూసార పరీక్షలకు కూడా ఆధునిక టెక్నాలజీ వచ్చిందని.. సేంద్రీయ వ్యవసాయ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయం ప్రకృతి విపత్తులను తట్టుకుంటుందన్నారు. సేంద్రీయ పద్దతిలో పండించిన కూరగాయలకు మంచి డిమాండ్ ఉందని. వ్యవసాయ పనిముట్లను సబ్సిడీలో రైతులకు అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తోందని నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు అన్నారు. రైతులకు ఉపయోగపడేలా విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయలో యాంత్రికరణ అవసరమన్నారు. సాంకేతికతను జోడించి వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా వ్యవసాయం చేయాలని అన్నారు. నూతన విధానాలతో వ్యవసాయ సాగు చేయాలని ఎంపీ శ్రీకృష్ణ దేవరాయల సూచనలు చేశారు. కాగా.. గుంటూరు జిల్లా విజ్ఞాన్ యూనివర్శిటీలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో భాగంగా అభ్యుదయ రైతులకు పురస్కారాలు ప్రధానం చేశారు. రైతు నేస్తం ఫౌండేషన్ - విజ్ఞాన్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. మొత్తం 250 మంది రైతులకు పురస్కారాలు వరించాయి. మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా రైతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో మంత్రి అచ్చెన్నాయుడితో పాటు ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు, విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య , రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## బెదిరించి టీడీపీ సభ్యత్వాలు నమోదు : గుడివాడ అమర్నాథ్



**విశాఖపట్నం, (క్రైమ్ మిర్రర్):** టీటీడీ సభ్యత్వ నమోదుపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పలు విమర్శలు గుప్పించారు. ముచ్చెర్ల గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై అబద్ధాలు చెబతున్నారని మండిపడ్డారు. బెదిరించి, మభ్యపెట్టి ప్రజల నుంచి టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేశారని వ్యాఖ్యలు చేశారు. ఆ గ్రామంలో టీడీపీ తప్ప వేరేపార్టీలు లేవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యత్వంపై దొంగలెక్కలు చెబుతున్నారని అన్నారు. ప్రజలకు తెలియకుండానే వారి ఆధార్ కార్డులు తీసుకుని సభ్యత్వాలు నమోదు చేశారని విమర్శించారు. ముచ్చెర్ల గ్రామంలో వందకు వంద శాతం టీడీపీ సభ్యత్వం నమోదు అనేది పచ్చి అబద్ధం అని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గ్రామంలో 1400 మంది ప్రజలు టీడీపీ సభ్యత్వం నమోదయిందని చెప్తున్నారని.. కొన్ని చోట్ల బెదిరించి సభ్యత్వం నమోదు చేశారని ఆరోపించారు. ముచ్చెర్ల గ్రామంలో వైఎస్ఆర్సీపీ బలంగా ఉంది..ఈ గ్రామంలో వైసీపీతో పాటు జనసేన, బీజేపీ పార్టీలు లేవా అని ప్రశ్నించారు. ముచ్చర్ల గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ వైసీపీ గెలుచుకుందన్నారు. సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పి టీడీపీ నేతలు ప్రజలు వద్ద నుంచి ఆధార్ కార్డులు తీసుకొని టీడీపీ సభ్యత్వం నమోదు చేశారని వ్యాఖ్యలు చేశారు. 100 శాతం సభ్యత్వం జరిగిందని మంత్రి లోకేష్ ముచ్చెర్ల గ్రామానికి ఎలా వస్తారని ప్రశ్నించారు. ముచ్చెర్ల గ్రామంలో 600 ఎకరాల భూమిని తెలుగుదేశం పార్టీ నాయకులు కొట్టేసే ప్రయత్నంలో భాగంగా సభ్యత్వంపై దొంగ లెక్కలు చెబుతున్నారంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు టీటీడీ లెటర్ అమ్ముకునే స్థితికి హోంమంత్రి అనిత పేషి చేరుకుందని విమర్శించారు అమర్నాథ్. సనాతన ధర్మం గురించి మాట్లాడే నాయకులు టీటీడీ లెటర్ గురించి ఏమీ చెపుతారని ప్రశ్నించారు. మంత్రులు నెల వారీగా వసూళ్లు చేస్తున్నారని గుడివాడ అమర్నాథ్ ఆరోపణలు గుప్పించారు.

## "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం" పథకాకాన్ని ప్రారంభించిన మంత్రి లోకేశ్



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం" పథకాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ముందుగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన మంత్రి లోకేశ్.. తరగతి గదులు, కెమిస్ట్రీ ల్యాబ్ పరిశీలించారు. అనంతరం క్లాస్ రూముల్లో విద్యార్థినిలతో కాసేపు ముచ్చటించారు. రాష్ట్రవ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న 1,48,419 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజనం అందించాలని చంద్రబాబు సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు నేటి నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ కళాశాలల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. అయితే డొక్కా సీతక్క మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలతో మంత్రి లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఎంతో కీలకమైన దశ అన్నారు. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు ఇప్పటి నుంచే దూరంగా ఉండటం అలవాటు చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వాతావరణం మీ పరిసరాల్లో ఎక్కడ కనిపించినా వెంటనే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మీరంతా బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. రానున్న రోజుల్లో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. మీలో ఒక్కడిగా నన్నూ భావించి ఏం చేస్తే బాగుంటుందో సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని" చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నేడు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. దీని కోసం ఈ ఏడాదికి రూ. 29.39 కోట్లు విడుదల చేయగా.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మరో రూ. 85.84 కోట్ల నిధులు కేటాయించారు. విద్యార్థులను చదువు వైపు మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు భోజనం అందించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దాన్ని రద్దు చేసింది. అమ్మఒడి ఇస్తున్నామనే వంకతో వారికి భోజనం దూరం చేసింది. అయితే నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో అనేక మంది విద్యార్థులు తమకు మళ్లీ ఈ పథకాన్ని అమలు చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హామీ ఇచ్చిన లోకేశ్ అధికారంలోకి రాగానే పథకం అమలుకు జీవో జారీ అయ్యేలా కృషి చేశారు.

## తమిళనాడులో ప్రారంభమైన జల్లికట్టు

### పోటీల్లో పాల్గొననున్న 600పైగా ఎద్దులు



**చెన్నై,(క్రైమ్ మిర్రర్):** తమిళనాడులో సంప్రదాయ జల్లికట్టు క్రీడలు మొదలయ్యాయి. తమిళనాడులో పొంగల్ పండుగ సందర్భంగా ఏటా జనవరిలో జల్లికట్టు నిర్వహిస్తారు. పరుగెత్తే పశువులను పట్టుకుని నిలువరించేందుకు యువకులు ప్రయత్నిస్తారు. అలాగే గ్రౌండ్‌లో ఎద్దులను లొంగదీసుకుని వాటిపై ఆధిపత్యం చెలాయించేందుకు పోటీపడతారు. తాజాగా పుదుక్కోట్టై జిల్లాలో జల్లికట్టు క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తచ్చన్‌కురిచిలో జరిగిన ఈ జల్లికట్టు క్రీడలో తిరుచ్చి, దిండిగల్, మనప్పరై, పుదుక్కోట్టై, శివగంగై జిల్లాల నుంచి దాదాపు 600కి పైగా ఎద్దులు పాల్గొన్నాయి. సుమారు 300 మందికిపైగా యువకులు ఎద్దులను నిలవరించేందుకు పోటీపడ్డారు. జల్లికట్టు ఉత్సవం..! తమిళనాడు రాష్ట్రంలో ఇది అనాదిగా వస్తున్న ఆచారం..! ప్రతి సంక్రాంతి పండుగ సందర్భంగా తమిళనాడులో జల్లికట్టు ఉత్సవం జరుపుకుంటారు. జల్లికట్టు అంటే ఎద్దులను, కోడెలను బెదరగొట్టి ఒక మార్గం గుండా గుంపులుగా వదిలిపెడుతారు. గుంపులుగా పరుగులు తీస్తున్న ఎద్దులను యువకులు లొంగిదీసే ప్రయత్నం చేస్తారు. అలా లొంగదీసిన వ్యక్తిని విజేతగా ప్రకటిస్తారు. జనవరి నుంచి మే 31 మధ్య సాధారణంగా 120కిపైగా జల్లికట్టు ఈవెంట్‌లు నిర్వహిస్తారు. ఈ సంప్రదాయ ఎద్దుల క్రీడలను చూసేందుకు తమిళనాడు వ్యాప్తంగానే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు.

## ప్రముఖ అణు శాస్త్రవేత్త డాక్టర్ రాజగోపాల చిదంబరం కన్నుమూత



**ముంబై, (క్రైమ్ మిర్రర్):** ప్రముఖ అణు శాస్త్రవేత్త డాక్టర్ రాజగోపాల చిదంబరం(88) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబై జస్‌లోక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రాజగోపాల చిదంబరం మృతి పట్ల శాస్త్రవేత్తలతో పాటు రాజకీయ ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నారు. అణు శాస్త్రవేత్తగా తన కెరీర్‌ను చిదంబరం ప్రారంభించారు. పోఖ్రాన్-1(1975), పోఖ్రాన్-2(1998) అణు పరీక్షల్లో రాజగోపాల చిదంబరం కీలకపాత్ర పోషించారు. అణుశక్తి కమిషన్‌కు ఛైర్మన్‌గా సేవలందించారు. రాజగోపాలకు 1999లో పద్మవిభూషణ్, 1975లో పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. భారత ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా పని చేశారు. బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పని చేశారు. అటామిక్ ఎనర్జీ కమిషన్ ఛైర్మన్‌గా సేవలందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు. 1994-95 మధ్య కాలంలో ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ గవర్నర్ల బోర్డుకు ఛైర్మన్‌గా వ్యవహరించారు.



## అమెరికన్ కాంగ్రెస్ సభలో కమలా హ్యారిస్ పొరపాటు

### ప్రతిజ్ఞలో తడబాటు...సోషల్ మీడియాలో వైరల్

**న్యూయార్క్,(క్రైమ్ మిర్రర్):** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఓడిపోయిన తరవాత తొలిసారిగా జరిగిన కాంగ్రెస్ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన విధేయత ప్రతిజ్ఞలో హారిస్ తడబడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో ఆమెపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 119వ కాంగ్రెస్ ప్రారంభం సందర్భంగా సభ్యులు విధేయత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రతిజ్ఞలో 'నేను యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా జెండాకు విధేయత చూపుతాను' అని అభ్యర్థులు వ్యాఖ్యానించాలి. అయితే, హారిస్ జెండాను విస్మరించి ప్రతిజ్ఞ చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈక్రమంలోనే పలువురు నెటిజన్లు హారిస్ తీరుపై విమర్శలు చేస్తున్నారు. కమలా హారిస్ విధేయత ప్రతిజ్ఞను సలాడ్ చేసేశారని ఒకరు కామెంట్ చేయగా.. 'సెనెట్ ఎ÷-లోర్‌లో విధేయత ప్రతిజ్ఞను తప్పుగా పలికి హారిస్ దేశాన్ని అవమానించారు' అని మరొకరు రాసుకొచ్చారు. 'చరిత్రలో అత్యల్ప ఐక్యూ కలిగిన అధ్యక్ష అభ్యర్థి కమలాహారిస్' అని మరో నెటిజన్ విమర్శించారు. ఇదిలాఉండగా.. కమలాహారిస్‌కు సంబంధించిన మరో వీడియో సైతం వైరల్‌గా మారింది. అందులో సెనెట్‌లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో కమలా హారిస్ ప్రతిజ్ఞ చేయిస్తున్నారు.



## పటాకుల ఫ్యాక్టరీలో పేలుడు... ఆరుగురు మృతి

**చెన్నై,(క్రైమ్ మిర్రర్):** తమిళనాడులోని విరుధునగర్ జిల్లాలో భారీ పేలుడు సంభవించింది. సత్తూర్ సమీపంలోని పటాకుల ఫ్యాక్టరీలో ఒక్కసారిగా పేలుడు చోటుచేసుకున్నది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పటాకుల పేలుడు ధాటికి కార్మికులు కొన్ని మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. సమీపంలోని ఆరు ఇండ్లు ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ముగ్గురి మృతదేహాలను వెలికితీశామన్నారు. కాగా, గతేడాది అక్టోబర్‌లో కూడా తిరువూరు జిల్లాలోని ఓ పటాకుల గోడౌన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. వారిలో 9 నెలల చిన్నారి కూడా ఉన్నది. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి 10 ఇండ్లకుపైగా ధ్వంసమయ్యాయి. పేలుడు శబ్దానికి ప్రజలు భయంతో పరుగులు తీశారు.

## విద్యార్థి ప్రాణం తీసిన క్లాస్‌మేట్ల గొడవ

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** ఒక విద్యార్థి, అతడి క్లాస్‌మేట్ మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో స్కూల్ ముగిసిన తర్వాత క్లాస్‌మేట్ మరికొందరితో కలిసి కత్తితో అతడిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థి మరణించాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం షకర్‌పూర్ ప్రాంతంలోని రాజకీయ సర్వోదయ బాల విద్యాలయంలో క్లాసులు ముగిసిన తర్వాత కొందరు విద్యార్థులకు ఎక్స్‌ట్రా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా 14 ఏళ్ల ఇషు గుప్తా మరో విద్యార్థి కృష్ణతో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో క్లాస్ ముగిసిన తర్వాత కృష్ణ మరో ముగ్గురు స్టూడెంట్స్‌తో కలిసి స్కూల్ బయట ఇషు గుప్తాపై దాడి చేశాడు.

## మా తరానికి శంకరే గ్యాంగ్‌స్టర్



'పదేళ్లుగా మేమంతా పానిండియా సినిమాలు చేస్తున్నాం. కానీ మేం గొప్పగా ఫీలయ్యే దర్శకుడు శంకర్. ఆయన మా అందరికీ ఓజీ(ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్). నాతో సహా ఎంతోమంది దర్శకులకు ఆయనే స్ఫూర్తి. పెద్ద పెద్ద కలలను తెరపై ఆవిష్కరించేందుకు భయపడాల్సిన అవసరం లేదనే నమ్మకాన్ని ఓ జనరేషన్‌కి కలిగించాయి ఆయన సినిమాలు. 'గేమ్‌ఛేంజర్'లోని ఓ సన్నివేశం నాకు 'ఒకేఒక్కడు' సినిమాను గుర్తుచేసింది. అంతకు పదింతలు ఈ సినిమా అలరిస్తుంది. రామ్‌చరణ్ ఈ సినిమాతో హీరోగా మరింత ఎత్తుకు ఎదుగుతాడు.' అని రాజమౌళి అన్నారు. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. అంజలి, కియారా అద్వాని కథానాయికలు. దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 'ఒక్కడు, పోకిరి సినిమాలు నాకిష్టం. అలాంటి సినిమానే 'గేమ్ ఛేంజర్'. అయితే.. నా సినిమాలో ప్రేక్షకులు కోరుకునే అంశాలన్నీ ఇందులో ఉంటాయి. ఓ ప్రభుత్వ అధికారి, ఓ రాజకీయ నాయకుడు మధ్య జరిగే యుద్ధమే ఈ సినిమా. ఇందులో హీరో ఫ్లాష్‌బ్యాక్ ఆడియన్స్‌పై ప్రభావం చూపుతుంది. చాలామంది ఈ సంక్రాంతిని 'శంకరాత్రి' అంటున్నారు. కానీ నన్నడిగితే ఇది 'రామ్ నవమి'. అంతబాగా చేశాడు ఇందులో రామ్‌చరణ్. కార్తిక్ సుబ్బరాజ్ అద్భుతమైన కథ ఇచ్చారు. ఇండియన్ సినిమావైపు హాలీవుడ్ చూసేలా చేసిన రాజమౌళి మా ట్రైలర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని శంకర్ పేర్కొన్నారు. గేమ్‌ఛేంజర్‌లోని కొన్ని సీన్స్ చూశాక తొడ కొట్టాలనిపించిందని దిల్‌రాజు చెప్పారు.

# ఏడాదంతా స్టార్స్ హంగామా

ఎవరేమనుకున్నా.. కథానాయకులే సినిమాలకు కళా కాంతి. హీరోలు ఎన్ని సినిమాలు చేస్తే.. సినీ పరిశ్రమ అంత కళకళలాడుతుంది. ఇసుమంత కూడా దీన్ని కాదనలేం. ఒకప్పుడు ఒక్కో హీరో ఏడాదికి అరడజనుకు పైనే సినిమాలు చేసేవాళ్లు. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. క్వాలిటీ మోజు.. పానిండియా క్రేజు పెరిగిపోయి.. బడ్జెట్ అమాంతం కొండెక్కి కూర్చుంది. దాంతో ఒక్కో సినిమా తీయడానికే ఏడాది పడుతున్నది. ఈ కారణంగా కొందరు స్టార్ల సినిమాలు ఒక్కో ఏడాదిలో విడుదలే కావడంలేదు. 2024లో అసలు సినిమాలే లేని హీరోలు అయిదారుగురున్నారు. అయితే.. 2025 మాత్రం పరిస్థితి అలాలేదు. స్టార్ హీరోల సినిమాలతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లన్నీ కళకళలాడబోతున్నాయి. ఈ ఏడాది ఇద్దరు హీరోలు మినహా.. దాదాపు అందరు హీరోల సినిమాలు విడుదల కానుండటం విశేషం. ఆ సంగతేంటో తెలుసుకుందా పదండి..



గత ఏడాది చిరంజీవి నటించిన ఒక్క సినిమా కూడా లేదు. ఈ ఏడాది ఆయన 'విశ్వంభర'తో రానున్నారు. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మే 9న విడుదల కానున్నట్లు తెలుస్తున్నది. అలాగే.. అనిల్ రావిపూడి, శ్రీకాంత్ ఓదెల కథలకు కూడా మెగాస్టార్ పచ్చజెండా ఊపేశారు. ఈ ఏడాదంతా ఆ సినిమాల పనిలో బిజీగా ఉంటారాయన. ఇక హ్యాట్రిక్ స్టార్ నందమూరి బాలకృష్ణకు గత ఏడాదంతా ఎన్నికల హడావిడే సరిపోయింది. అందుకే ఒక్క సినిమా కూడా ఆయనది రిలీజ్ కాలేదు. అయితే.. ఈ ఏడాది ప్రథమంలోనే 'డాకు మహారాజ్'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారాయన. మరోవైపు 'అఖండ' సీక్వెల్ 'అఖండ %-% తాండవం' షూటింగ్ కూడా జరుగుతున్నది. ఈ ఏడాది దసరాకల్లా ఆ సినిమాను తెచ్చేందుకు దర్శకుడు బోయపాటి కసరత్తులు చేస్తున్నారు. గత ఏడాది విడుదలైన నాగార్జున ఏకైక సినిమా 'నా సామిరంగ'. ఈ ఏడాది మాత్రం ఆయనవి రెండు సినిమాలు విడుదల కానున్నాయి. వాటిలో ఒకటి 'కుబేరా'. ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక, రెండో సినిమా రజనీకాంత్ 'కూలీ'. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నాగార్జున విలన్‌గా నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. ఈ రెండూ కూడా కోలీవుడ్‌కి చెందిన పానిండియా సినిమాలే కావడం గమనార్హం. గత ఏడాది 'సైంధవ్'గా ఉద్వేగపూరితంగా కనిపించిన వెంకీ.. ఈ ఏడాది మాత్రం సంక్రాంతి శోభనంతా తనలోనే నింపుకొని 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఇక గత ఏడాది ఒక్క సినిమా కూడా చేయని మరో హీరో పవన్‌కల్యాణ్. ఆయన కూడా పాలిటిక్స్‌లో బిజీగా ఉండటం వల్లే సినిమాలు చేయలేదు. ఈ ఏడాది ఏకంగా ఆయన నుంచి రెండు సినిమాలు రానున్నాయి. ఒకటిలో ఒకటి సుజిత్ 'ఓజీ' కాగా, రెండోది 'హరిహర వీరమల్లు'. రెండూ పానిండియా ప్రాజెక్టులే కావడం విశేషం. వీటిలో 'హరిహర వీరమల్లు' మార్చి 28న విడుదల కానుంది.


గత ఏడాది 'దేవర'గా బాక్సాఫీస్ దగ్గర సందడి చేసి, 600కోట్లు కొల్లగొట్టిన ఎన్టీఆర్.. ఈ ఏడాది 'వార్ 2'తో పానిండియా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. హృతిక్ రోషన్‌తో కలిసి తారక్ నటిస్తున్న ఈ బాలీవుడ్ పానిండియా యాక్షన్ థ్రిల్లర్‌కు ఆయాన్ ముఖర్జీ దర్శకుడు. తారక్ వన్ ఆఫ్‌ది హీరో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తునే ఈ సినిమా విడుదలవ్వడం సహజం. ఈ ఏడాది ఆగస్ట్ 14న సినిమా విడుదల కానుంది. వచ్చే నెల నుంచి ప్రశాంత్‌నీల్ సినిమా షూటింగ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు తారక్. ఇక గత ఏడాది 'కల్కి 2898ఏడీ'తో ఏకంగా 13కోట్ల వసూళ్లను రాబట్టి బాక్సాఫీస్‌ని షేక్ చేసిన పానిండియా సూపర్‌స్టార్ ప్రభాస్.. ఈ ఏడాది 'ది రాజా సాబ్'గా రానున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ కామెడీ హారర్ పానిండియా థ్రిల్లర్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 10న ఈ సినిమా విడుదల చేయనున్నట్టు సమాచారం. ఇక ఈ ఏడాది అంతా సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' షూటింగ్‌లో ప్రభాస్ బిజీగా ఉంటారు. రామ్‌చరణ్ నటించిన ఒక్క సినిమా కూడా గత ఏడాది విడుదల కాలేదు. ఈ ఏడాది అందరికంటే ముందు 'గేమ్‌ఛేంజర్'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారాయన. సంక్రాంతి కానుకగా ఈ నెల 10న సినిమా విడుదలకానున్న విషయం తెలిసిందే. మరోవైపు బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఆయన నటిస్తున్న సినిమా షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతున్నది. అన్నీ కుదిరితే ఈ ఏడాది చివర్లో ఈ సినిమా రావొచ్చు. ఇక భాను భోగవరపు దర్శకత్వంలో రవితేజ 'మాస్ జాతర', శైలేష్ కొలను దర్శకత్వంలో నాని 'హిట్ 3', గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ 'వీడీ 12'(వర్కింగ్ టైటిల్), రామ్ అబ్బరాజు దర్శకత్వంలో శర్వానంద్ సినిమా, హీరో నితిన్ రాబిన్‌హుడ్, తమ్ముడు సినిమాలు, నిఖిల్ 'శ్వయంభూ', విశ్వక్‌సేన్ 'లైలా', సిద్ధు జొన్నలగడ్డ జాక్, తెలుసుకదా సినిమాలు, అడివి శేష్ గూఢచారి2, డెకాయిట్.. ఇవన్నీ ఈ ఏడాదే విడుదల కానున్నాయి. ఆ విధంగా దాదాపుగా హీరోలందరి సినిమాలూ ఈ ఏడాది సందడి చేయనున్నాయన్నమాట. అయితే.. ఈ ఏడాది కూడా సినిమాలు విడుదల కాని హీరోలు ఇద్దరున్నారు. వారిలో ఒకరు సూపర్‌స్టార్ మహేశ్‌బాబు. గత ఏడాది 'గుంటూరు కారం'తో బాక్సాఫీస్‌కు ఘాటెక్కించిన మహేష్.. ప్రస్తుతం రాజమౌళి సినిమా కోసం మేకోవర్ అయ్యే పనిలో ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ గురువారం లాంఛనంగా మొదలైంది. వేసవిలో షూటింగ్ అంటున్నారు.



## ఆ సినిమాతో నా జీవితం మారింది

ప్రపంచ మానవాళి అంతా.. గత ఏడాదికి వీడ్కోలు పలికి, కొత్త ఏడాదికి స్వాగతం పలికేశారు. గత జ్ఞాపకాలను మనసులోనే దాచుకొని, కొత్త ఏడాది ఇచ్చే అనుభూతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల రష్మిక పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఇన్నాళ్ల జీవితంలో మీకు గర్తుండిపోయిన మధుర జ్ఞాపకం ఏంటి? అనే ప్రశ్న రష్మికకు ఎదురైంది. దానికి ఆమె సమాధానమిస్తూ.. '2016 డిసెంబర్ 30.. ఆ రోజును నా జీవితంలో మరిచిపోలేను. ఎందుకంటే.. నా తొలి సినిమా 'కిరాక్ పార్టీ' విడుదలైంది ఆ రోజే. ఆ సినిమాతో నా జీవితమే మారిపోయింది. ఆ సినిమాతో కన్నడలో బిజీ అయ్యాను. నా టాలీవుడ్ డెబ్యూ 'చలో' సినిమా ఛాన్స్ నాకొచ్చిందంటే.. కారణం 'కిరాక్ పార్టీనే'. ఆ సినిమా చూసే 'చలో'లో నన్ను తీసుకున్నారు. ఆ తర్వాత నా కెరీర్ సమూలంగా మారిపోయింది. ఇప్పుడంతా నన్ను నేషనల్ క్రష్ అంటున్నారంటే.. దాని వెనుక 'కిరాక్ పార్టీ' సినిమానే ఉంది. అందుకే.. ఆ సినిమా విడుదల డేట్ నాకు ప్రత్యేకం.' అంటూ గుర్తుచేసుకున్నది అందాల రష్మిక.

## ఇక దబిడి దిబిడే..



బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్ని ముమ్మరం చేశారు. బుధవారం 'దబిడి దిబిడే..' అంటూ సాగే మూడో పాటను విడుదల చేశారు. బాలకృష్ణ సినిమాలోని ఫేమస్ డైలాగ్ 'దబిడి దిబిడే' పేరుతో ఈ పాటను రూపొందించారు. తమన్ సంగీతాన్నందించిన ఈ గీతాన్ని కాసర్ల శ్యామ్ రచించారు. వాగ్దేవి ఆలపించింది. ఈ పాటలో బాలకృష్ణ, ఊర్వశి రౌతేలా నృత్యాలు ప్రధానాకర్షణగా నిలిచాయి. కొరియోగ్రాఫర్ శేఖర్ వీజే చక్కటి నృత్యరీతుల్ని సమకూర్చారు. అదిరిపోయే మాస్ స్టెప్పులతో ఈ పాట హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ప్రగ్యాజైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కార్తీక్, సంగీతం: తమన్, దర్శకత్వం: బాబీ కొల్లి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.